తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

నిజం.. నిర్భయంగా

హైదరాబాద్ | మంగళవారం, మార్చి 3, 2026 | పేజీలు 8 | /aksharagalam.com | సంపుటి : 14 సంచిక : 7 వెల : 3/-

## పాక్ వైమానిక స్థావరంపై అఫ్ఘాన్ దాడి



ఇస్లామాబాద్, మార్చి 2 : పాకిస్థాన్‌లోని కీలక సైనిక స్థావరాలను అఫ్ఘానిస్థాన్ టార్గెట్ చేసింది. రావల్పిండిలోని 'నూర్ ఖాన్' ఎయిర్‌బేస్‌పై వైమానిక దాడుల చేశామని ఆఫ్ఘనిస్థాన్ రక్షణ శాఖ సోమవారం ప్రకటించింది. ఇరు దేశాలను విడదీస్తున్న డ్యూరాండ్ రేఖను తమ సైనికులు దాటుకొని పాకిస్థాన్ భూభాగంలోకి అడుగుపెట్టారని తాలిబన్ మంత్రి ఒకరు చెప్పారు. క్వెట్టా, ఖైబర్ పఖ్తూంఖ్వాలోని వివిధ ప్రాంతాల్లో మిలిటరీ బేస్‌లపై దాడులు చేసినట్టు ప్రకటించారు. ఇరు దేశాల పరస్పర దాడులు, సరిహద్దుల్లో కాల్పులు నాలుగో రోజుకు చేరుకున్నాయి. తమ సైనిక ఆపరేషన్‌లో 400 మంది అఫ్ఘాన్ ఫైటర్లను మట్టుబెట్టినట్టు పాకిస్థాన్ ప్రకటించుకుంది. కాబూల్ సహా అఫ్ఘాన్‌లోని వివిధ ప్రావిన్స్‌లపై దాడులు చేసినట్టు పాక్ అధికార వర్గాలు తెలిపాయి.



### మూడో రోజుకు ఇరాన్‌పై ఇజ్రాయెల్ అమెరికా దాడులు

# యుద్ధం

## భీకర రూపం



- 130 నగరాలపై బాంబుల వర్షం 600 దాటిన మృతులు
- హెజ్బొల్లా ప్రతీకార దాడులతో లెబనాన్‌లో ఉద్రిక్తత
- గల్ఫ్ దేశాలపై క్షిపణులు.. అమెరికాకు యూరప్ మద్దతు
- చమురు కేంద్రాలపై దాడులతో ప్రపంచ ఆందోళన
- టెహ్రాన్‌లో వాయుసేన, క్షిపణి కేంద్రాలే ప్రధాన లక్ష్యం
- బంకర్లలోకి పరుగులు తీస్తున్న ఇజ్రాయెల్ పౌరులు
- ఇరాన్‌కు మద్దతుగా మిలిటెంట్ గుంపుల రంగప్రవేశం
- పశ్చిమాసియా అంతటా విస్తరిస్తున్న ఘర్షణల మబ్బులు

దుబాయ్: పశ్చిమాసియా మరింత ఉద్రిక్తతల్లో కూరుకుపోతోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులు మూడో రోజుకు చేరుకోగా యుద్ధం తీవ్రరూపం దాల్చింది. సోమవారం ఒక్కరోజే సుమారు 130 నగరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, బాంబులతో దాడులు జరిగాయి. ముఖ్యంగా రాజధాని టెహ్రాన్

(మిగతా 2వ పేజీలో)



### మరిన్ని భీకర దాడులు చేస్తాం, ఇరాన్ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దు: ట్రంప్

తమ జోలికి ఎవరు వచ్చినా వదిలి పెట్టేది లేదన్న డొనాల్డ్ ట్రంప్

ప్రపంచంలో అమెరికా సైన్యం అత్యంత శక్తిమంతమైనదని ధీమా



# ప్రజల కోణంలో పనిచేయండి

### డీసీసీ అధ్యక్షులే భవిష్యత్ నాయకులు : రాహుల్

- పదవులు లక్ష్యం కాదుడ బాధ్యతే ముఖ్యమని దిశానిర్దేశం
- బీజేపీ అధికార దాహంపై ఘాటు విమర్శలు
- ఉన్నోడి వైపు బీజేపీడ లేనోడి వైపు కాంగ్రెస్
- సమన్వయంతో సాగుతున్న సీఎం, పీసీసీ చీఫ్‌కు ప్రశంసలు
- ట్రేడ్ డీల్ అంశంపై కేంద్రంపై ఆరోపణలు

హైదరాబాద్: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులే రాబోయే రోజుల్లో మంచి నాయకులుగా ఎదుగుతారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. మీలోనే భవిష్యత్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ముఖ్యమంత్రులు ఉన్నారని పేర్కొన్నారు. ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని, ఎవరికీ గులామిగిరి చేయవద్దని స్పష్టం చేశారు. పార్టీకి కళ్లూ చెవులూ మీరేనని అన్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహించిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల శిక్షణ శిబిరం

(మిగతా 2వ పేజీలో)

19 ఏళ్లలో జెడ్పీటీసీ స్థాయి నుంచి

### సీఎంని అయ్యా: రేవంత్

తన మీద కేసులు పెట్టారని, కోర్టుకు వెళ్లారని గుర్తు చేసుకున్న రేవంత్

రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే లక్ష్యమని వ్యాఖ్య






### నేడు చంద్రగ్రహణంతో యాదాద్రి ఆలయం మూసివేత

తిరుమలతో పాటు టిటిడి ఆలయాల మూత

మిగతా 2లో



# పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

- ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష
- 6.4 లక్షల ఉద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం: మహేశ్వర్‌రెడ్డి
- డీఏలు, గ్రాట్యూటీ, పీఎఫ్ బకాయిలు ఇంకా పెండింగ్‌లోనే
- అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్‌పై డీకే అరుణ ధ్వజమెత్తు
- ఉద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వం: ఈటెల, రఘునందన్‌రావు





### భారత్‌కు కెనడా నుంచి 2.6 బిలియన్ డాలర్ల యురేనియం

- అణుఇంధన భద్రతకు కీలక ఒప్పందం
- అరుదైన ఖనిజాల దిగుమతిపై అవగాహన పత్రాలు
- మోదీమార్క్ కార్నీ భేటీలో ద్వైపాక్షిక చర్చలు
- నాలుగేళ్లలో వాణిజ్యాన్ని 50 బిలియన్ డాలర్లకు పెంపు లక్ష్యం
- సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం త్వరలో ఖరారు

న్యూఢిల్లీ: భారత్‌కు కెనడా నుంచి భారీ స్థాయిలో యురేనియం సరఫరా కానుంది. ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని 2.6 బిలియన్ డాలర్ల విలువైన యురేనియం సరఫరా ఒప్పందంపై రెండు దేశాలు సంతకాలు చేశాయి. దీని ద్వారా దేశ అణుశక్తి రంగానికి దీర్ఘకాలిక ఇంధన భరోసా లభించనుంది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరియు కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ ఢిల్లీలో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలపై

(మిగతా 2వ పేజీలో)

### క్రీడాకారులకు ఆర్థిక సాయం

- ఇతర ప్రోత్సాహకాల అందచేత
- క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉన్నాం
- ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వం అండ
- మంత్రి వాకిటి శ్రీహరి సమీక్ష



### ప్రజాభిప్రాయం మేరకు నడుచుకోవాలి

ప్రభుత్వ సేవల్లో లోపం రాకుండా చూడాలి

- బాణాసంచా ప్రమాదంపై శివకాశికి వెళ్లి స్టడీ
- అధికారులకు సిఎం చంద్రబాబు సూచన



### పెద్దల ఇళ్లను బుల్డోజర్లతో పడగొడతాం

కాంగ్రెస్ సర్కార్‌కు బండి సంజయ్ వార్నింగ్

- గాంధీ విగ్రహం పేరుతో పేదల ఇళ్లు కూల్చివేస్తున్నారన్న బండి సంజయ్
- తాము అధికారంలోకి వచ్చాక పెద్దల ఇళ్లను కూల్చివేస్తామని హెచ్చరిక
- మూటల కోసమే రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చారని విమర్శ



### తెలుగు రాష్ట్రాలపై భానుడి ప్రతాపం..

ఈసారి ఎండలు మామూలుగా ఉండవు!

- తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండుతాయన్న ఐఎండీ
- సాధారణం కంటే ఎక్కువ రోజులు వడగాల్పుల ప్రభావం
- ఉత్తర తెలంగాణ జిల్లాల్లో 45 డిగ్రీలు దాటే అవకాశం
- తమిళనాడులోనూ మూడు నెలల పాటు ఎండల తీవ్రత

## నేడు చంద్రగ్రహణంతో యాదాద్రి ఆలయం మూసివేత

యాదగిరిగుట్ట,మార్చి2 : ఈ నెల 3న సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయాన్ని మూసివేస్తున్నట్టు ఆలయ ఈవో భవానీశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రగ్రహణం కారణంగా ప్రధానాలయంతో పాటు ఉపాలయాలు, అనుబంధ దేవాలయాలలో ఉదయం 7 గంటలలోపు సుప్రభాత, నిజాభిషేకం, అర్చనలు ముగించి మూసివేస్తామని వెల్లడించారు. 4వ తేదీన ఉదయం 3 నుంచి 5.30 గంటల వరకు ప్రధానాలయంతో పాటు ఉపాలయాలను తెరిచి గ్రహణ దోష పరిహారార్థం సంప్రోక్షణ, ఆలయ శుద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం సుప్రభాతం, తిరువారాధన, బాలబోగం, ఆరగింపు, నిజాభిషేకం నిర్వహించి, ఉదయం 8.45 గంటలకు ఉభయ దర్శనాలను ప్రారంభిస్తామని చెప్పారు. చంద్రగ్రహణం సందర్భంగా స్వామివారి సన్నిధిలో రేపు జరిగే హోలికోత్సవాన్ని సోమవారం సాయంత్రం నిర్వహిస్తామని ప్రకటించారు.

## క్రీడాకారులకు ఆర్థిక సాయం

హైదరాబాద్,మార్చి2 : క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. 2026-2027 బడ్జెట్ లో క్రీడాకారులకు ఆర్థిక సహాయం, ఇతర వసతులపై డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఆ రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడా పాలసీ తీసుకు వచ్చి క్రీడలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను ఆటల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని మంత్రి వివరించారు. అందులో భాగంగా క్రీడా శాఖకు 2026-2026 బ్జడెట్ లో అధిక నిధుల కేటాయింపుతో పాటు, క్రీడాకారులకు ఆర్థిక సహాయంపై అధికారులతో చర్చించారు. ఒలంపిక్, పారా ఒలంపిక్, అంతర్జాతీయ, జాతీయ ఆటల పోటీల్లో పతకాలు సాధిందించిన వారికి ఆర్థిక సహాయం అందించేలా బ్జడెట్ లో కేటాయింపులు ఉండేలా ప్రతిపాదనలు పంపాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పాఠశాల విద్య నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు ఆటల్లో ప్రతిభ కనబరుస్తున్న వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని చెప్పారు. ప్రభుత్వ ప్రోత్సహంతోనే విద్యార్థి, యువకులు క్రీడల్లో రాణిస్తారని మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు. క్రీడాకారులకు ఇచ్చే పారితోషికాలపై విధివిధానాలు రూపొందించాలని, వాటిని నిష్పక్షపాతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఓఆ సోనీ బాలాదేవి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాహుల్‌ను ప్రధాని చేయడమే మన కర్తవ్యం

డీసీసీ అధ్యక్షులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశం కోసం రాహుల్ ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకోసం మనమంతా కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మోడీ వల్ల దేశానికి తీరని నష్టం జరుగుతోందన్నారు. రాషహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమమని అన్నారు. వికారాబాద్ వేదికగా తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా ముగింపు సమావేశం సోమవారం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో తానెప్పుడూ పైరవీలు చేయలేదన్నారు. గతంలో ప్రజాసమస్యలపై గళం విప్పిన తనపై కేసులు నమోదు చేశారని గుర్తు చేసుకున్నారు. ఆదివారం సైతం తాను కోర్టుకు వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. ఈ 19 ఏళ్లలో జడ్పీటీసీ నుంచి తాను సీఎం అయ్యానని గుర్తు చేసుకున్నారు. ఆ క్రమంలో పార్టీ పదవులు సైతం నిర్వహించానని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను మంచి అనుభవం పొందానన్నారు. తనపై అనేక కేసులు పెట్టారని.. పరువు నష్టం దావాలు కూడా వేశారని పేర్కొన్నారు. దేశం కోసం, తమ కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలని పేర్కొన్నారు. సోనియా గాంధీ పేరుతోనే తెలంగాణలో అధికారంలోకి వచ్చామని వివరించారు. ఐదేళ్లు చేసిన పోరాటాల వల్ల రాహుల్ గాంధీ ప్రధాన ప్రతిపక్ష నేత అయ్యారని వివరించారు. దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నారు. దేశంలో అనేక సమస్యలపై రాహుల్ గాంధీ పోరాటం చేశారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఇచ్చిన నేతగా సోనియా పేరు చిరస్థాయిగా ఉంటుందని అన్నారు. త్యాగాలు చేసిన కుటుంబం వారిదని అన్నారు.

## ప్రజాభిప్రాయం మేరకు నడుచుకోవాలి

ప్రభుత్వ సేవలపై ప్రజలు సంపూర్ణంగా సంతృప్తి చెందాల్సిందేనని, అధికారులు ఆ మేరకు కృషి చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అధికారుల తీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని తేల్చిచెప్పారు. ఈ నెల నుంచి కనీసం 80 శాతం నుంచి 90 శాతం తగ్గకుండా పబ్లిక్ పర్సెప్షన్ ఉండాలని స్పష్టం చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పాలనలో 'పబ్లిక్ పర్సెప్షన్' కు అధిక ప్రాధాన్యతని స్తున్నారు. సోమవారం ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్‌పై క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ..'పెన్షన్ల పంపిణీలో లోటుపాట్లు తలెత్తుతున్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆర్టీసీ బస్సు సర్వీసులు బావున్నా.. ఆర్టీసీ బస్ స్టేషన్‌లో సౌకర్యాలు, ఔట్ సోర్సింగ్ సర్వీసులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. బస్ స్టేషన్‌కు వచ్చిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణం సౌకర్యవంతంగా ఉండాలి.

## పెద్దల ఇళ్లను బుల్డోజర్లతో పడగొడతాం

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా గాంధీ విగ్రహం ఏర్పాటు కోసం పేదల ఇళ్లను కూల్చివేయడంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆయన... ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బఫర్ జోన్, ఎఫ్టీఎల్ సాకుతో సామాన్యుల ఇళ్లను కూలిస్తే, తాము అధికారంలోకి వచ్చాక పెద్దల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తామని హెచ్చరించారు. గాంధీ విగ్రహం ఏర్పాటు చేసే సాకుతో వందలాది కుటుంబాలను రోడ్డున పడేయడం గాంధీ సిద్ధాంతాలకే విరుద్ధమని మండిపడ్డారు. గతంలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి చెందిన కాలేజీల కూల్చివేత విషయంలో విద్యార్థుల పరీక్షలను సాకుగా చూపిన ప్రభుత్వం... ఇప్పుడు ఖమ్మంలో కూల్చివేతలు చేస్తున్నప్పుడు ఇంటర్ విద్యార్థుల పరీక్షలు, భవిష్యత్తు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. ఒవైసీని ప్రసన్నం చేసుకోవడం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం హిందువులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని బండి సంజయ్ ఆరోపించారు. హిందువులను జైల్లో వేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని, దీనికి ప్రజలంతా ఏకమై బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

# యుద్ధం భీకర రూపం

పరిసర ప్రాంతాలు బాంబు శబ్దాలతో మార్మోగాయి. వాయుసేన స్థావరాలు, క్షిపణి కమాండ్ కేంద్రాలు ప్రధాన లక్ష్యాలుగా మారాయి. ఇరాన్ ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 600 మందికి పైగా మరణించగా, వెయ్యికి పైగా గాయపడ్డారు. అమెరికా బి2 స్టెల్త్ బాంబర్ విమానాలు భారీ బరువున్న బాంబులను ప్రయోగించాయి. బాలిస్టిక్ క్షిపణి కేంద్రాలు, యుద్ధ నౌకలు దెబ్బతిన్నట్టు సమాచారం. ఇదే సమయంలో ఇజ్రాయెల్ సరిహద్దులపై హెజ్బొల్లా మిలిటెంట్ సంస్థ విరుచుకుపడింది. ఇరాన్ సుప్రీం నాయకుడి మరణానికి ప్రతీకారంగా భారీ క్షిపణి దాడులు చేసినట్టు ప్రకటించింది. దానికి ప్రతిగా ఇజ్రాయెల్ లెబనాన్‌పై తీవ్ర దాడులకు దిగింది. లెబనాన్ ఆరోగ్య శాఖ ప్రకారం 31 మంది మృతి చెందగా, వందలాది మంది గాయపడ్డారు. ఇజ్రాయెల్ నగరాలు, ముఖ్యంగా టెల్ అవీవ్ పరిసరాలు కూడా క్షిపణి దాడులతో దద్దరిల్లాయి. ప్రజలు భయంతో బంకర్లలోకి పరుగులు తీశారు. ఇజ్రాయెల్‌లో ఇప్పటివరకు కనీసం 12 మంది మరణించినట్టు సమాచారం. గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైనా ఇరాన్ దాడులు కొనసాగించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, బహ్రెయిన్ ప్రాంతాల్లో పేలుళ్లు చోటుచేసుకున్నాయి. పౌర సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. దాడులు ఆగకపోతే తాము కూడా కఠిన చర్యలు తీసుకుంటామని గల్ఫ్ దేశాలు హెచ్చరించాయి. ఇరాన్‌కు మద్దతుగా లెబనాన్, ఇరాక్ ప్రాంతాలకు చెందిన మిలిటెంట్ గ్రూపులు కూడా యుద్ధ రంగంలోకి దిగుతున్నట్టు ప్రకటించాయి. మరోవైపు అమెరికాకు బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ మద్దతు ప్రకటించాయి. గల్ఫ్ ప్రాంత భద్రత కోసం అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నాయి. సౌదీ అరేబియాలోని రస్ తనౌరా చమురు శుద్ధి కేంద్రంపై జరిగిన దాడులు అంతర్జాతీయ మార్కెట్లను కుదిపేశాయి. రోజుకు లక్షల బ్యారెల్ల సామర్థ్యం కలిగిన ఈ కేంద్రం తాత్కాలికంగా మూసివేయబడింది. కువైట్‌లోని అహ్మదీ చమురు శుద్ధి కేంద్రం వద్ద కూడా డ్రోన్ శకలాలు పడి కార్మికులు గాయపడ్డారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కార్యాలయంపై కూడా క్షిపణి దాడి జరిగినట్టు ఇరాన్ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఈ వార్తలను ఇజ్రాయెల్ అధికారికంగా ధృవీకరించలేదు. అనంతరం నెతన్యాహు ప్రజల్లో ప్రత్యక్షమయ్యారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై



దాడులు మరో నాలుగైదు వారాలు కొనసాగవచ్చని ప్రకటించారు. అవసరమైతే దీర్ఘకాల పోరాటానికి సిద్ధమని చెప్పారు. ఇరాన్ కొత్త నాయకత్వంతో చర్చలకు తాను సిద్ధమని కూడా తెలిపారు. అయితే ప్రస్తుతానికి దాడులు పూర్తిస్థాయిలో కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఇరాన్ మాత్రం అమెరికా యుద్ధ విమానాలను తాము కూల్చేశామని ప్రకటించింది. కువైట్‌లో మూడు అమెరికా యుద్ధ విమానాలు కూలిపోయిన ఘటనపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. అమెరికా వాటిని పొరపాటున కూల్చేశామని చెబుతుండగా, ఇరాన్ దాడి ఫలితమేనని పేర్కొంటోంది. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. యుద్ధం మరింత దేశాలకు వ్యాపించే సూచనలు కనిపిస్తున్నాయి. చమురు సరఫరా, అంతర్జాతీయ వాణిజ్యం, ప్రాంతీయ భద్రతపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# తెలుగు రాష్ట్రాలపై భానుడి ప్రతాపం..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండల తీవ్రత అత్యధికంగా ఉండనుందని స్పష్టం చేసింది. సాధారణంగా వేసవిలో ఉండే ఉష్ణోగ్రతల కంటే ఈసారి పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని, ముఖ్యంగా వడగాల్పుల రోజులు గణనీయంగా పెరుగుతాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర వెల్లడించారు. ఇప్పటికే ఫిబ్రవరి నెలలో 2001 తర్వాత అత్యల్ప వర్షపాతం నమోదు కావడం, చలి తీవ్రత తక్కువగా ఉండటం రాబోయే కఠిన వేసవికి సంకేతాలని అధికారులు విశ్లేషిస్తున్నారు.

**తెలంగాణ, ఏపీల్లో పరిస్థితి ఇలా..**

ఈ వేసవిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వడగాల్పులు వీచే రోజుల సంఖ్య 3 నుంచి 15 రోజుల వరకు, కొన్ని ప్రాంతాల్లో అంతకంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా తెలంగాణలోని ఉత్తర జిల్లాలపై సూర్యుడు నిప్పులు చెరిగే ప్రమాదం ఉంది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, మెదక్, సిద్దిపేట్, హనుమకొండ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌ను దాటే అవకాశాలు మెండుగా ఉన్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. హైదరాబాద్‌లోనూ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల పైనే నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఎన్సో న్యూట్రల్ పరిస్థితులు ఏర్పడుతుండటంతో వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

**ఆరోగ్య భద్రత ముఖ్యం**

తీవ్రమైన ఎండల కారణంగా వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవారు బయట తిరగడం తగ్గించుకోవాలని ఐఎండీ సూచించింది. పెరిగే ఉష్ణోగ్రతలు ప్రజల ఆరోగ్యంపైనే కాకుండా నీటి వనరులు, విద్యుత్ డిమాండ్‌పైనా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రభుత్వ యంత్రాంగం, స్థానిక సంస్థలు నీటి ఎద్దడి తలెత్తకుండా, వడదెబ్బ మరణాలు సంభవించకుండా ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. మరోవైపు పొరుగున ఉన్న తమిళనాడులోనూ పరిస్థితి భిన్నంగా ఏమీ లేదు. అక్కడ కూడా మార్చి నుంచి మే వరకు మూడు నెలల పాటు తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఐఎండీ తెలిపింది. ముఖ్యంగా ఆ రాష్ట్ర ఉత్తర జిల్లాల్లో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు కానున్నాయి. అయితే, కొమరిన్ ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో పశ్చిమ కనుమల ప్రాంతాల్లోని జిల్లాల్లో మాత్రం రాబోయే రెండు నుంచి ఐదు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇది స్థానికులకు కాస్త ఉపశమనం కలిగించవచ్చని వాతావరణ కేంద్రం పేర్కొంది. మిగిలిన ప్రాంతాల్లో మాత్రం పొడి వాతావరణంతో పాటు, చెన్నై వంటి నగరాల్లో ఉదయం వేళల్లో పొగమంచు కనిపించే అవకాశం ఉంది.

# పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

కవాడిగూడ, మార్చి 2 : రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరా పార్క్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ దీక్షకు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు హాజరయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు, శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీలు ఈటెల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్‌రావు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో



సుమారు 3.6 లక్షల ప్రభుత్వ ఉద్యోగులు, 2.8 లక్షల రిటైర్డ్ ఉద్యోగుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని తీవ్రంగా విమర్శించారు. మొత్తం 6.4 లక్షల మందికి సంబంధించిన బకాయిలు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉండటం దారుణమన్నారు. గ్రాట్యూటీ, కమ్యూటేషన్, పీఎఫ్ బకాయిలతో పాటు ఆరు డీఏలను ప్రభుత్వం ఇప్పటికీ చెల్లించలేదని ఆరోపించారు. కోర్టుల ఒత్తిడి భయంతో ఒక్క డీఏ ప్రకటించి చేతులు దులుపుకుందన్నారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లు మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ ప్రయోజనాలు అందక వైద్య ఖర్చులకు కూడా డబ్బులు లేక సుమారు 70 మంది ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ పోరాటానికి జెండాలతో సంబంధం లేకుండా మద్దతు ఇచ్చిన ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఇంత సిగ్గుమాలిన వ్యవస్థ ఉంటుందని అనుకోలేదని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంపీ రఘునందన్‌రావు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తు చేసుకోవాలని అన్నారు. భద్రత లేకుండా ప్రజల్లోకి వస్తే ఉద్యోగులు, నిరుద్యోగుల కష్టాలు తెలుస్తాయని ఎద్దేవా చేశారు. నిరాహార దీక్షలో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమురయ్య, మాజీ ఎమ్మెల్యేలు చింతల రాంచంద్రారెడ్డి, గువ్వల బాలరాజు, మాజీ మంత్రి కృష్ణయాదవ్, వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు, తాడూరి శ్రీనివాస్, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## భారత్‌కు కెనడా నుంచి 2.6 బిలియన్ డాలర్ల యురేనియం



విస్తృత చర్చలు జరిపారు. ఈ సందర్భంగా యురేనియం సరఫరాతో పాటు అరుదైన ఖనిజాల దిగుమతి, కీలక రంగాల్లో సహకారానికి సంబంధించిన అవగాహన ఒప్పందాలు కుదిరాయి. భారత్‌లో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడంలో అణుశక్తి కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఈ ఒప్పందం ప్రాధాన్యత సంతరించుకుంది. చిన్న, మధ్య తరహా అణు రియాక్టర్లు, శుద్ధ ఇంధన ఉత్పత్తి, సరఫరా గొలుసుల బలోపేతం వంటి అంశాల్లో కూడా ఇరుదేశాలు కలిసి పని చేయాలని నిర్ణయించాయి. ప్రస్తుతం సుమారు 13 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రాబోయే నాలుగేళ్లలో 50 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పెట్టుబడులు, రక్షణ, సాంకేతికత, విద్య, పునరుత్పాదక ఇంధనం రంగాల్లో సహకారాన్ని విస్తరించేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఉగ్రవాదం, ప్రపంచ శాంతి, ప్రాంతీయ భద్రత వంటి అంశాలపై కూడా నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు. త్వరలోనే సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని ఖరారు చేసి ఆర్థిక సంబంధాలకు మరింత బలం చేకూర్చాలని నిర్ణయించారు. ఈ పరిణామాలతో భారత్‌కెనడా సంబంధాలు కొత్త దశలోకి ప్రవేశిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు.

## 19 ఏళ్లలో జెడ్పీటీసీ స్థాయి నుంచి సీఎంని అయ్యా: రేవంత్

**రాజకీయాల్లో ఎప్పుడూ ప్రజా సమస్యల పైనే గళమెత్తానన్న ముఖ్యమంత్రి**

**తన మీద కేసులు పెట్టారని, కోర్టుకు వెళ్లారని గుర్తు చేసుకున్న రేవంత్ రెడ్డి**

**రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే లక్ష్యమని వ్యాఖ్య**

తాను 19 ఏళ్లలో జెడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రిని అయ్యానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ, ఏపీసీసీ చీఫ్ షర్మిల తదితరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తాను రాజకీయాల్లో ఎప్పుడూ ప్రజా సమస్యలపై గళమెత్తానని అన్నారు. తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ పైరవీలు చేయలేదని తెలిపారు. తన మీద అనేక కేసులు పెట్టారని, కోర్టుకు కూడా వెళ్లానని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త లక్ష్యం కూడా అదేనని అన్నారు. దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని వ్యాఖ్యానించారు. సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని, రాహుల్ గాంధీ అనేక సమస్యలపై పోరాటం చేశారని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కేసీ వేణుగోపాల్,కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# హోలీ సందడి..

**చిన్న పాటి జాగ్రత్తలు పాటిస్తే మేలు**

**రంగుల పండగకు సిద్ధం**

**వాటర్ గన్స్, రంగుల కొనుగోళ్లు**

**ఆమనగల్లు, మార్చి 02 (అక్షర గళం)**

హోలీ పండుగంటే అందరూ ఆనందంతో ఎగిరిగంతేస్తారు. పిల్లల నుంచి పెద్దల వరకు హుషారుగా.. ఉత్సాహంగా రంగులతో ఆడుకోవడం అంటే అందరికీ సరదానే. రంగులను ఒకరికి ఒకరు పూసుకోవడం, నీళ్లు చల్లుకుంటూ.. కోడి గుడ్లు తలపై రుద్దుతూ.. డీజే పాటలకు నృత్యాలు చేస్తూ.. రంగుల పండుగ హోలీని ఎంతో ఇష్టంగా జరుపుకుంటారు. ఎంతో చారిత్రక ప్రాశస్త్యమున్న ఈ పండుగ రోజు చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే ఆనందాన్ని పంచుతుంది. లేకపోతే విషాదానికి దారి తీస్తుంది. పౌర్ణమి ఘడియలు రావడంతో మంగళవారం హోలీ వేడుకలు జరుపుకునేందుకు మండల ప్రజలు సిద్ధమయ్యారు. వీరితో పాటు విద్యార్థులు, యువత, వివిధ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా హోలీ వేడుకలు జరుపుకుంటున్నారు. దీంతో ఆమనగల్లుతో పాటు పట్టణాలు, గ్రామాల్లో ఎక్కడ చూసినా హోలీ సందడి వచ్చేసింది.





## ఆకట్టుకునేలా వాటర్ గన్స్..

పిల్లలు ఆకట్టుకునేలా మార్కెట్లో కేజీఎఫ్, డోరేమాన్, బెన్టేన్.. వంటి బొమ్మలతో ఆకర్షణీయంగా వివిధ రకాల వాటర్ గన్స్ తో పాటు హోలీ భీషర్థులు అందుబాటులో ఉన్నాయి. ఇవి రూ.20 నుంచి రూ.500 వరకు సుమారు 70 రకాల మోడల్స్ లో వాటర్ గన్స్ విక్రయాలు చేస్తున్నారు. సహజ రంగులను హోలీ సంబురాల్లో వాడటం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవని వైద్యులు సూచిస్తున్నారు. అయితే పూలు, ఆకులు, పండ్లతో రంగులను తయారు చేసే ఓపిక, తీరిక లేని నేటి ఆధునీకాలంలో రసాయన రంగులను విరివిగా ఉపయోగిస్తున్నారు.



## గుండాల శ్రీ అంబ రామలింగేశ్వర స్వామి
# దేవాలయ హుండి లెక్కింపు

**వెల్దండ మార్చి 02 (అక్షరగళం) :** వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామంలోని దక్షిణ కాశిగా విరజల్లుతున్న గుండాల అంబ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవాలయంలో ఏర్పాటు హుండీలో భక్తులు వేసిన కానుకలు 2 లక్షల 40 వేల 472 రూపాయల ఆదాయం వచ్చినట్లు దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ వీణాధరి ఈవో ప్రసాద్ తెలిపారు కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సందీప్ రెడ్డి, వైస్ చైర్మన్ అరుణ్ కుమార్ నాయక్ శ్రీ అంబ రామలింగేశ్వర స్వామి ఆలయం కమిటీ సభ్యులు అంజయ్య, లింగం మల్లేష్ ఆలయ అర్చకులు సంతోష్ శర్మ సంతోష్ శర్మ సురేష్ శర్మ నరహరి శర్మ తదితరులు పాల్గొన్నారు





## ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో
## కాంగ్రెస్ చేరిన బర్కత్ పల్లి సర్పంచ్ మాల్కేటి నవ్యరాజు

**వెల్దండ మార్చి 02(అక్షరగళం) :** వెల్దండమండల పరిధిలోని బర్కత్ పల్లి గ్రామ సర్పంచ్ మాల్కేడి నవ్య రాజు సోమవారం ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి సమక్ష్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు సర్పంచ్ నవ్య రాజు మరియు వార్డ్ నెంబర్ సభ్యులు కు ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి వార్డు సభ్యులు మొగిలి జంగయ్య, కోడెల సంతోష గౌడుగు అలివేలు శ్రీను, గౌడుగు నర్సింహా గౌడుగు కొండల్ లతో పాటు గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు కార్యక్రమంలో వెల్దండ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మట్ట వెంకటయ్య గౌడ్ కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ లచ్చిరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు

# అన్ని మతాలను కాంగ్రెస్ గౌరవిస్తుంది





**ఆమనగల్లు, మార్చి 02 (అక్షర గళం):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మండల పరిధిలోని అకుతోట పల్లి గ్రామంలోని రెవరెండ్ జీసీ క్రుపయ్య మెమోరియల్ వింగ్ చర్చి ప్రారంభోత్సవం మరియు 102 హోమ్ మిషన్ సెలబ్రేషన్స్ లో వారు ముఖ్య అతిథులుగా హాజరై క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి లు మాట్లాడుతూ.. మానవతా విలువలు ప్రేమ, సహనం, కరుణ వంటి వాటిని మనుషులందరికీ బోధించి ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో నడిచేందుకు క్రీస్తు ఎంతగానో తాపత్రాయపడ్డారని వివరించారు. ఆయన చూపిన మార్గంలో ప్రజలు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ, సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, మాజీ వైస్ ఛైర్మన్ గుర్రం కేశవులు, ఎంబి జీసీ అధ్యక్షులు ఐపీ ఆశీర్వాదం, జీసీ ప్రధాన కార్యదర్శి జీకే రూపస్, పాస్టర్ వరప్రసాద్, కౌన్సిలర్ సుధీర్, మాజీ సర్పంచ్ కె ప్రమోద్ కుమార్, సంఘ పెద్దలు జీకే లాజర్, బిన్నీ కే రామచంద్రయ్య, వార్డు సభ్యులు విజయ్, నర్సింహా, సాదిక్, అబ్దుల్ అలీమ్, విజయ్ నాయక్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, నాజర్ తదితరులు పాల్గొన్నారు.

# కోమటికుంట చెరువులో
# వాసవి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

**::: ఆకుల సతీష్**

అక్షర గళం, కుత్బుల్లాపూర్ : బాచుపల్లి కోమటికుంట చెరువులో వాసవి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని నాయకులు ఆకుల సతీష్ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో నిర్వహించిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాచుపల్లి ప్రాంతంలో కోమటికుంట సరస్సు ఒక గుర్తింపు పొందిన జలాశయం కాగా, దాని పూర్తి నిల్వ స్థాయి (ఎఫ్టీఎల్ ) , బఫర్ జోన్ ప్రాంతాలు చట్టపరంగా రక్షించాలన్నారు. వాసవి కన్స్ట్రక్షన్స్ వారు బ్లాకులు 8 , 9 నిర్మాణాన్ని ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో చేపట్టినట్లు గత అధికారిక సంయుక్త పరిశీలనల్లో వెల్లడైంది. ఈ విషయంపై ఇప్పటికే సంబంధిత శాఖలు రెండు సార్లు తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాయి. అలాగే బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో 2క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయబడ్డాయి. ప్రజాహిత దృష్ట్యా ఈ అంశంపై హైకోర్టులో దాఖలయ్యాయి. హైకోర్టు 09-09-2025 తేదీన ఇచ్చిన ఉత్తర్వులో సంబంధిత హైడ్రా రెవెన్యూ ఇరిగేషన్ అధికారులకు రికార్డుల పరిశీలన, పునఃసర్వే, సరిహద్దుల గుర్తింపు , అక్రమ నిర్మాణాలపై చర్యలు మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు తుది డీమార్కేషన్ లేదా సర్వే , అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా అధికారులు సహకరిస్తున్నారని, హెచ్ఎండిఏ కమిషనర్ సెప్టెంబర్ నెలలో వాసవి కన్స్ట్రక్షన్ కనుక్కులంగా తప్పుడు ఉత్తర్వుల ఆధారంగా 8,9 రివైజ్డ్ ఎన్వోసీ లేకుండా నిర్మాణంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాగునీటి , రెవెన్యూ శాఖల తప్పనిసరి ఎన్ఓసీలు లేకుండానే నిర్మాణం కొనసాగుతున్నది కావున ఇది చట్టపరమైన నిబంధనల ఉల్లంఘనకే , న్యాయస్థానం ఉత్తర్వులకు విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు, ఇప్పటికైనా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చెరువు ఎఫ్ టి ఎల్ /బఫర్ జోన్లో రివైజ్డ్ ఎన్వోసీ లేకుండా నిర్మాణం చేస్తున్న వాసవి కన్స్ట్రక్షన్ ఎనిమిది తొమ్మిది బ్లాకుల నిర్మాణాలను తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. కోమటికుంట చెరువును పరిరక్షణకి సరైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, శ్రీనివాస్, ఈశ్వర్ రెడ్డి, ఎల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.





## ప్రజా సమస్యలను
## పరిష్కరించాలని ఎమ్మెల్యేకు పలువురు వినతి

**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు సమస్యలను పరిష్కరించాలని నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు సోమవారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి పలు ఆహ్వానాలు, వినతులు అందజేశారు. దీంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.



## ఘనంగా సత్యం జన్మదిన వేడుకలు

**ఆమనగల్లు, మార్చి 02 (అక్షర గళం):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు పూసల సత్యం జన్మదిన వేడుకలు సోమవారం పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఛైర్మన్ పత్యనాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూసల సత్యం ను పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని భవిష్యత్తు రాజకీయాల్లో ఉన్నత స్థాయిలో ఎదగాలని పత్యనాయక్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, కౌన్సిలర్లు ఎర్రవోలు మహేష్, మొక్తల వెంకటయ్య, నాగిళ్ళ జగన్, సునీత ప్రశాంత్ నాయక్, నాయకులు దుడ్డు కృష్ణ యాదవ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# కడ్తాలలో కేసీఆర్ ముందస్తు హోలీ వేడుకలు

### కేసీఆర్ చిత్రపటానికి
### రంగులు చల్లి అభిమానాన్ని చాటిన ఎల్ఎన్ రెడ్డి




**ఆమనగల్లు, మార్చి 02 (అక్షర గళం):** కడ్తాల్ మండల కేంద్రంలో ముందస్తు హోలీ వేడుకలు కేసీఆర్ చిత్రపటంతో ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ కడ్తాల్ మండల కేంద్రంలో మాజీ సర్పంచ్, సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మాదిరిగా ఏర్పాటుచేసిన ముందస్తు హోలీ వేడుకలలో కేసీఆర్ చిత్ర పటానికి కేసీఆర్ అభిమానులు, మహిళలు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కేసీఆర్ చిత్రపటానికి రంగులు చల్లి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. మహిళా సంక్షేమ పథకాలు కేసీఆర్ హయాంలోనే బాగున్నాయని, కేసిఆర్ జిందాబాద్ అంటూ,మళ్ళీ కేసీఆర్ ఏ కావాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ హోలీ వేడుకలలో కేసీఆర్ అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కెసిఆర్ గారికి తమ అభిమానాన్ని చాటడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ,వార్డు సభ్యుడు రవి నాయక్, ఉద్యమకారుడు లక్ష్మణ చారి,గురిగళ్ల రామచంద్రయ్య,మూడ అశోక్,మిర్యాణం సంతోష్, అమృతం పాండు, మహేష్, సురేష్, ప్రశాంత్,కరుణాకర్,రాఘువ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఇటీవల ఒకే కుటుంబంలో ముగ్గురి ఆత్మహత్య... వడ్డీవ్యాపారుల అరెస్ట్

**అంబర్‌పేట సామూహిక ఆత్మహత్యల కేసులో నలుగురు అరెస్ట్**

**వడ్డీ వ్యాపారుల వేధింపులే కారణమని తేల్చిన పోలీసులు**

**రూ. 57 లక్షల అప్పు విషయంలో తీవ్ర ఒత్తిడి, అవమానాలు**

**సూసైడ్ నోట్స్, ఫోన్ కాల్ డేటా ఆధారంగా నిందితుల గుర్తింపు**

**ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు**




హైదరాబాద్ అంబర్‌పేట బాపూనగర్‌లో ఇటీవల చోటుచేసుకున్న విషాద ఘటనలో, వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకున్న కేసులో పోలీసులు నలుగురు నిందితులను సోమవారం అరెస్ట్ చేశారు. ఫిబ్రవరి 24న కాడ్గేకర్ రామరాజ్ (54), ఆయన భార్య మాధవి, సోదరుడు కాడ్గేకర్ శశాంక్ రాజ్ తమ ఇంట్లో విగతజీవులుగా కనిపించిన విషయం తెలిసిందే. ఘటనా స్థలంలో లభించిన సూసైడ్ నోట్స్, కుటుంబ సభ్యుల వాంగ్మూలాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. కింగ్స్ బిర్యానీ హోటల్ నిర్వహణ కోసం మృతులు నిందితుల వద్ద రూ. 57 లక్షల అప్పు తీసుకున్నారు. అయితే, నిందితులు అధిక వడ్డీలు వసూలు చేయడమే కాకుండా.. ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు, భూమి పత్రాలను బలవంతంగా తీసుకున్నారని డీసీపీ తెలిపారు. డబ్బులు తిరిగి చెల్లించాలని నిందితులు ఫోన్లలో అసభ్యంగా మాట్లాడటం, ఇంటికి వచ్చి బహిరంగంగా అవమానిస్తామని బెదిరించడం వంటి చర్యలకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు ముందు రోజు రాత్రి (ఫిబ్రవరి 23) కూడా నిందితులు ఫోన్ చేసి డబ్బులు కట్టకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించినట్లు కాల్ డేటా ద్వారా పోలీసులు నిర్ధారించారు. ఈ కేసును బిఎన్ఎస్ సెక్షన్ 108 (ఆత్మహత్యకు ప్రేరేపించడం) కింద మార్చి దర్యాప్తు చేశారు. అరెస్టయిన వారిని ఇర్ఫాన్ అలియాస్ మహ్మద్ వాసి ఉజ్ జమాన్, పి. రాజశేఖర రెడ్డి, మహ్మద్ నవాజ్, సయ్యద్ మజీద్ హైదర్‌గా గుర్తించారు. విచారణలో తాము అధిక వడ్డీలకు అప్పులిచ్చామని, వసూళ్ల కోసం కుటుంబ సభ్యులను తీవ్ర ఒత్తిడి చేశామని, పత్రాలను తమ వద్దే ఉంచుకున్నామని నిందితులు అంగీకరించారు. నిరంతర వేధింపులు, అవమానాలు తట్టుకోలేకే ఆ కుటుంబం ఆత్మహత్య చేసుకుందని పోలీసులు స్పష్టం చేశారు.

# 44 పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇస్తా: విజయ్ దేవరకొండ

**వివాహం అనంతరం**
**సొంతూరులో సందడి చేసిన విజయ్ దేవరకొండ**

**9వ, 10వ తరగతుల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు**
**సాధించిన విద్యార్థులకు ఉపకారవేతనం**

**ఈ సంవత్సరం నుండి గ్రామంలో,**
**వచ్చే సంవత్సరం నుండి అచ్చంపేట డివిజన్‌లో!**



ప్రముఖ సినీ నటుడు విజయ్ దేవరకొండ కీలక నిర్ణయం తీసుకున్నారు. వివాహం అనంతరం తన సొంతూరిలో సందడి చేసిన ఆయన వచ్చే విద్యా సంవత్సరం నుంచి అచ్చంపేట డివిజన్‌లోని విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తానని ప్రకటించారు. విజయ్ దేవరకొండ, రష్మికల వివాహం గత నెలలో జరిగింది. ఈరోజు నాగర్ కర్నూలుజిల్లా బల్మూరు మండలంలోని స్వగ్రామం తుమ్మన్‌పేటకు భార్య రష్మికతో కలిసి వచ్చారు. ఇటీవల తన స్వగ్రామంలో కొత్త ఫాంహౌస్ నిర్మించుకున్నారు. గ్రామానికి వచ్చిన విజయ్ దేవరకొండ, రష్మికలకు గ్రామస్థులు, అభిమానులు డప్పులు, కోలాటంతో ఘనస్వాగతం పలికారు. గృహ ప్రవేశం అనంతరం, తులసి మొక్క చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆ తర్వాత సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామస్థులను ఉద్దేశించి విజయ్ దేవరకొండ మాట్లాడారు. తమ కుటుంబం 32 ఏళ్ల క్రితం తుమ్మన్‌పేట నుంచి వెళ్లినప్పటికీ గ్రామస్థులతో తమ కుటుంబానికి విడదీయరాని బంధం ఉందని అన్నారు. తనకు సొంతూరులోనే మొదటి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించినట్లు తల్లిదండ్రులు చెప్పారని గుర్తు చేసుకున్నారు. తన తండ్రి కోరిక మేరకు ఇక్కడ ఇల్లు నిర్మించుకున్నానని అన్నారు. అందరికీ విందు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 9వ, 10వ తరగతుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఉపకారవేతనం ఇస్తానని ప్రకటించారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి దీనిని అందజేస్తానని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అచ్చంపేట డివిజన్ పరిధిలోని 44 పాఠశాలల్లో దీనిని అమలు చేస్తానని వెల్లడించారు.

# వారికి ఇష్టం లేకపోతే రంగులు చల్లొద్దు: సజ్జనార్

**రేపు హోలీ పండుగ**

**ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్న సీపీ**

**రంజాన్ ప్రార్థనలకు ఆటంకం కలగకుండా చూడాలని ఆదేశాలు**

**బలవంతంగా రంగులు పూయడంపై నిషేధం**

**రేపు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు మద్యం బంద్**

**న్యూసెన్స్ చేసే వారిపై షీ టీమ్స్ ప్రత్యేక నిఘా**



హైదరాబాద్‌లో హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ హెచ్చరించారు. సోమవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన.. పండుగ నేపథ్యంలో నగరంలో పలు ఆంక్షలు విధించారు. ఎవరికైనా ఇష్టం లేకపోతే, లేని వారిపై బలవంతంగా రంగులు చల్లడం, పాదచారులు, వాహనాలపై రంగులు లేదా రంగు నీళ్లు చల్లడం నిషేధమని స్పష్టం చేశారు. ప్రస్తుతం రంజాన్ మాసం కొనసాగుతున్నందున ముస్లింల ప్రార్థనలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు భద్రత ఏర్పాటు చేయాలని, పీస్ కమిటీలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నగరవ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్, బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే ఆకతాయిలపై షీ టీమ్స్ ప్రత్యేక నిఘా ఉంచుతాయని తెలిపారు. హోలీ వేడుకల్లో డీజేలకు అనుమతి లేదని, రసాయన రంగులకు బదులుగా సహజ రంగులు వాడాలని సీపీ సూచించారు. యువకులు రోడ్లపై గుంపులుగా తిరుగుతూ న్యూసెన్స్ చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో మద్యం దుకాణాలు, బార్లు, కల్లు కాంపౌండ్లు మూసివేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని, ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

**ఆమనగల్లు, మార్చి 02 (అక్షరగళం):** ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని.. కల్కిదోన్న గోపాలస్వామి అనుగ్రహం పొందాలని ప్రముఖ సంఘ సేవకులు, ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము ఆకాంక్షించారు. తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ కల్కిదోన్న గోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వేడుకల్లో సోమవారం పాపిశెట్టి శ్వేత రాము దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి పల్లకి సేవలో మోసి భక్తి భావాన్ని చాటారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని అయన అన్నారు. ప్రత్యేక పూజల అనంతరం పాపిశెట్టి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. వేడుకల్లో ఆలయ చైర్మన్ పట్టాభిరామ శర్మ, కృష్ణమూర్తి అర్చకులు, శ్రీనివాసయ్య, ప్రవీణ్ కుమార్ చారి, వీరేష్ మరియు గ్రామస్తులు భక్తులు పెద్ద సంఖ్యలు హాజరయ్యారు.




# రూ. 600ల కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి హైడ్రా రక్షణ

### గంధంగూడలో 6.30 ఎకరాల
### ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్న హైడ్రా

**ఐటీ కారిడార్ సమీపంలో రూ.600 కోట్ల విలువైన భూమి రక్షణ**

**జలమండలికి కేటాయించిన స్థలంలో షెడ్ల తొలగింపు**

**ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ వేసిన అధికారులు**

**సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కోసం గతంలోనే స్థల కేటాయింపు**

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పడిన హైడ్రా మరో భారీ ఆపరేషన్ చేపట్టింది. ఐటీ కారిడార్‌కు ఆనుకుని ఉన్న గంధంగూడ ప్రాంతంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల చెర నుంచి విడిపించింది. సుమారు రూ.600 కోట్ల విలువ చేసే 6.30 ఎకరాల స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం గంధంగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 86/పి లో ఉన్న 6.30 ఎకరాల ప్రభుత్వ భూమిని సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం కోసం ప్రభుత్వం గతంలోనే జలమండలికి కేటాయించింది. అయితే, ఈ విలువైన స్థలంపై కన్నేసిన కొందరు అక్రమార్కులు రకరకాల పేర్లతో ఆక్రమణలకు పాల్పడుతూ వచ్చారు. అంతేకాకుండా, ఆ స్థలంలో అనధికారికంగా షెడ్లను కూడా నిర్మించి కబ్జా చేశారు. ఈ విషయంపై జలమండలి అధికారుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు హైడ్రా రంగంలోకి దిగింది. మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి హైడ్రా బృందం క్షేత్రస్థాయిలో పక్కాగా సర్వే నిర్వహించింది. ఇది ప్రభుత్వ భూమేనని నిర్ధారించుకున్న అనంతరం, అక్కడ వెలసిన అక్రమ నిర్మాణాలను, షెడ్లను అధికారులు కూల్చివేశారు. ఆక్రమణలన్నీ తొలగించిన తర్వాత మొత్తం 6.30 ఎకరాల స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో ఆక్రమణలకు తావులేకుండా ఇది ప్రభుత్వ స్థలం అని స్పష్టం చేస్తూ హైడ్రా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసింది.

# బాల్క సుమన్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు

**మంత్రి వివేక్ కాన్వాయ్‌పై దాడి కేసులో బాల్క సుమన్ అరెస్టు**

**సుమన్‌తో పాటు ముగ్గురుకు బెయిల్ మంజూరు**

**ప్రతి ఆదివారం పీఎస్‌లో హాజరు కావాలని షరతు**



బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు మంచిర్యాల జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి ఘటనలో ఆయనతో పాటు మరో ముగ్గురికి కోర్టు బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. గత నెలలో జరిగిన మున్సిపల్ ఎన్నికల అనంతరం క్యాతనపల్లిలో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఫిబ్రవరి 18న మంత్రి వివేక్ కాన్వాయ్‌పై జరిగిన దాడి కేసులో బాల్క సుమన్ అరెస్టయ్యారు. ప్రస్తుతం బాల్క సుమన్ ఆదిలాబాద్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కోర్టు ఆయనకు రూ.25 వేల పూచీకత్తుతో షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ప్రతి ఆదివారం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌కు హాజరు కావాలని ఆదేశించింది. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఎక్కువ మంది విజయం సాధించారు. దీంతో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక పలుమార్లు వాయిదాపడిన నేపథ్యంలో ఉద్రిక్తతలు తలెత్తాయి.

# ఇన్సూరెన్స్‌తోపాటు ఈక్విటీ.. కొత్త మ్యూచువల్ ఫండ్స్ ఇవే..

అంతర్జాతీయంగా ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే అవకాశాన్ని కల్పించే దిశగా టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ 'టాటా ఏఐఏ గ్లోబల్ ఈక్విటీ ఫండ్'ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ మార్చి 5 వరకు అందుబాటులో ఉంటుంది. జీవిత బీమా రక్షణ కల్పించడంతో పాటు గ్లోబల్ ఈక్విటీల్లో పెట్టుబడుల ద్వారా దీర్ఘకాలికంగా మూలధన వృద్ధికి కూడా దోహదపడేలా ఇది ఉంటుంది. టాటా ఏఐఏ శుభ్ గ్లోబల్ ఇన్వెస్ట్ లాంటి యూనిట్ లింక్డ్ పథకాల ద్వారా ఈ ఫండ్ అందుబాటులో ఉంటుంది. ప్రధానంగా ఈ ఫండ్ నిధుల్లో 70%100% వరకు భాగాన్ని గ్లోబల్ ఈక్విటీల్లో, మిగతా భాగాన్ని డెట్, మనీ మార్కెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తారు.

**ట్రస్ట్ ఎంఎఫ్ మిడ్‌క్యాప్ ఫండ్**

ప్రధానంగా మిడ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసేందుకు ట్రస్ట్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా మిడ్ క్యాప్ ఫండ్‌ని ఆవిష్కరించింది. ఇది మార్చి 13 వరకు అందుబాటులో ఉంటుంది. మార్కెట్ క్యాపిటలైజేషన్‌పరంగా 101 నుంచి 250 ర్యాంకుల వరకు ఉండే సంస్థల షేర్లు, ఈక్విటీ సంబంధ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. దీనికి నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 టీఆర్ఐ ప్రామాణికంగా ఉంటుంది. దేశీయంగా తయారీ, ఆర్థిక సేవలు తదితర రంగాలకు చెందిన పలు మిడ్ క్యాప్ కంపెనీలు గణనీయంగా రాణిస్తున్నాయని సంస్థ తెలిపింది. గత అయిదేళ్లలో ఈ విభాగంలోని 37 కంపెనీలు మూడు రెట్లు రాబడులు అందించాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో మిడ్‌క్యాప్ కంపెనీల వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ ఫండ్ ఉపయోగపడుతుందని సంస్థ సీఈవో సందీప్ బాగ్లా తెలిపారు.

**ఐసీఐసీఐ ప్రు లైఫ్ డివిడెండ్ లీడర్స్ 50 ఇండెక్స్ ఫండ్**

యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్స్ (యులిప్) కింద ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్




కొత్తగా డివిడెండ్ లీడర్స్ 50 ఇండెక్స్ ఫండ్‌ని ప్రవేశపెట్టింది. నిలకడగా డివిడెండ్లను చెల్లించే ట్రాక్ రికార్డుతో ఫండమెంటల్‌గా పటిష్టంగా ఉన్న స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలికంగా మెరుగైన రాబడులు అందించడం దీని లక్ష్యం. బీఎస్ఈ 500 నుంచి ఎంపిక చేసిన 50 కంపెనీల ఇండెక్స్‌ని ఇది ట్రాక్ చేస్తుంది. ఐసీఐసీఐ ప్రు సిగ్నేచర్ అష్యూర్, స్మార్ట్‌కిడ్ అష్యూర్, స్మార్ట్ ఇన్సూరెన్స్ ప్లాన్ ప్లస్ (సిప్ ప్లస్) తదితర పథకాలతో ఇది లభిస్తుంది.




# టాటా ఏఐజీ కొత్త ఇన్సూరెన్స్ ప్లాన్

ముంబై: టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ 'యాక్సిడెంట్ సూపర్ గార్డ్ ప్లస్' ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ప్రమాదాల్లో సమగ్ర ఆర్థిక రక్షణను అందించే వ్యక్తిగత ప్రమాద బీమా ప్లాన్ ఇదని, దేశంలో ఏటా ప్రమాదాల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో దీన్ని తీసుకొచ్చినట్టు ప్రకటించింది. వ్యక్తుల ఆదాయం, అప్పులు, జీవనశైలి రిస్క్‌లకు అనుగుణంగా కవరేజీని ఎంపిక చేసుకోవచ్చు. ప్రమాద మరణం, శాశ్వత పాక్షిక, పూర్తి వైకల్యంలో ఏక మొత్తంలో బీమా పరిహారం లభిస్తుంది. ప్రమాదాల కారణంగా అత్యవసర వైద్యం కోసం ఆస్పత్రిలో చేరాల్సి వస్తే అయ్యే ఖర్చులకు రీయింబర్స్‌మెంట్ పొందొచ్చు. లోన్ షీల్డ్ (రుణాల కోసం), ఈఎంఐ ప్రొటెక్షన్, పెట్‌కేర్ పేరుతో ఐచ్ఛిక కవరేజీలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఐదేళ్ల కాల వ్యవధిపై వ్యక్తులు, కుటుంబ సభ్యులు ఈ ప్లాన్‌ను తీసుకోవచ్చు. వేతన జీవులకు ప్రీమియంలో అదనపు డిస్కౌంట్ లభిస్తుంది.

# పెరిగిన గ్యాస్ ధరలు.. 19 కిలోల సిలిండర్ కొత్త రేటు..



మార్చి నెలకు ఎల్పీజీ (లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్) ధరలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సవరించాయి. దేశవ్యాప్తంగా కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ల ధరలు రూ.28 నుంచి రూ.31 వరకు పెరిగాయి. అయితే 14 కిలోల గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేకపోవడం సాధారణ వినియోగదారులకు కొంత ఉపశమనం కలిగించే అంశం. రాజధాని ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.1740.50 నుంచి రూ.1768.50కు పెరిగింది. కోల్‌కతాలో ధర రూ.1844.50 నుంచి రూ.1875.50కు చేరింది. ముంబైలో రూ.1692 నుంచి రూ.1720కు పెరిగింది. అలాగే చెన్నైలో కమర్షియల్ సిలిండర్ ధర రూ.1899.50 నుంచి రూ.1929కు, హైదరాబాద్‌లో రూ. 1,962.50 నుంచి రూ. 1,990.50కు విశాఖపట్నంలో రూ. 1,791.50 నుంచి రూ. 1,822.50కు పెరిగినట్లు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు వెల్లడించాయి. ఆయిల్ కంపెనీల తాజా వివరాల ప్రకారం 14.2 కిలోల గృహ ఎల్పీజీ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు. ఢిల్లీలో ఇది రూ.853కు అందుబాటులో ఉంది. కోల్‌కతాలో రూ.951గా కొనసాగుతోంది. ముంబైలో రూ.852.50గా ఉంది. లక్నోలో గృహ సిలిండర్ ధర రూ.890.50గా కొనసాగుతోంది. హైదరాబాద్‌లో రూ. 905, విశాఖపట్నంలో రూ. 861లుగా ఉంది.



# రూ.3 లక్షలు దాటేసిన వెండి

బంగారం ధరలు అమాంతం పెరుగుతూ.. పసిడి ప్రియులకు షాకిస్తున్న వేళ, వెండి రేటు కూడా కొండెక్కుతోంది. ప్రస్తుతం దేశంలోని ప్రధాన నగరాల్లో సిల్వర్ రేటు ఎలా ఉంది?, వెండి ధర పెరగడానికి ప్రధాన కారణాలు ఏమిటనేది ఇక్కడ, ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం. హైదరాబాద్, విజయవాడలో కేజీ వెండి ధర రూ. 3.15 లక్షలకు చేరుకుంది. ముంబై, బెంగళూరు, చెన్నైలలో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. దేశంలోని ఇతర ఇతర ప్రధాన నగరాలతో పోలిస్తే.. సాధారణంగా ఢిల్లీలో వెండి రేటు కొంత తక్కువగానే ఉండేది. కానీ ఇప్పుడు ఇక్కడ కూడా కేజీ సిల్వర్ ధర రూ. 3.15 లక్షలకు చేరుకుంది.

**వెండి ధరలు పెరగడానికి కారణాలు**

ప్రస్తుతం సిల్వర్ ధరలు భారీగా పెరగడానికి ప్రధాన కారణం.. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం. యుద్ధం కారణంగా.. పెట్టుబడిదారులు బంగారం, వెండి వంటి లోహాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. యుద్ధం కాకుండా.. ఎలక్ట్రానిక్స్, సోలార్ ప్యానెల్స్, మెడికల్ యాక్ససరీస్ వంటి రంగాల్లో వెండికి భారీ డిమాండ్ ఉంది. డిమాండ్ ఎప్పుడైతే పెరుగుతుందో.. దానికి తగిన విధంగా సరఫరా ఉండాలి. సరఫరా తగ్గితే.. ధరలు తప్పకుండా పెరుగుదల దిశగా పరుగులు పెడతాయి. రాజకీయ, భౌగోళిక కారణాల వల్ల భారీగా పెరుగుతున్న వెండి రేటు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇదే జరిగితే సామాన్యులకు వెండి దూరమైపోతుంది.



# లగ్జరీ కార్ల సంస్థ మెర్సిడెస్ బెంజ్ సరికొత్త వీ క్లాస్

**లగ్జరీ కార్ల సంస్థ మెర్సిడెస్ బెంజ్ మార్కెట్లోకి సరికొత్త వీ-క్లాస్‌ను విడుదల చేసింది. లాంగ్ వీల్ బేస్, ఎయిర్‌మాటిక్ సస్పెన్షన్, లగ్జరీ సీట్లతో కూడిన ఈ కారు ప్రైవేట్ సూట్ ఆన్ వీల్స్‌గా ఉండనుందని మెర్సిడెస్ బెంజ్ ఇండి యా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ అన్నారు. డీజిల్, పెట్రోల్ వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న ఈ కారు పరిచయ ధర రూ.1.4 కోట్లు (ఎక్స్‌షోరూమ్).**


# ట్రావెల్.. క్యాన్సిల్




న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితులతో అటువైపు వెళ్లాల్సిన వారు తమ ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు. ఫ్లయిట్లను డైవర్ట్ చేసే రిస్కులు ఉండటం, ప్రయాణాలకు పట్టే వ్యవధిపై అనిశ్చితి నెలకొనడం, బీమా నిబంధనలపై సందేహాలు మొదలైన అంశాలు ట్రావెలర్ల సెంటిమెంటుపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. దీనితో 2025% బుకింగ్స్ రద్దు లేదా రీషెడ్యూల్ అవుతున్నాయని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ (ఐఏటీవో) వెల్లడించింది. గల్ఫ్ ట్రాన్సిట్ హబ్‌లు, సమీప ప్రాంతాల్లోని రూట్లకు ఇవి పరిమితమైనట్లు వివరించింది. గగనతలంపై ఆంక్షలు కొనసాగినా, పరిస్థితి మరింత తీవ్ర రూపు దాల్చినా వేసవి సీజన్‌లో ప్రయాణాలపై కూడా ప్రభావం పడొచ్చని ఐఏటీవో ప్రెసిడెంట్ రవి గొసెయిన్ తెలిపారు. సమీప భవిష్యత్తులో పశ్చిమాసియా దేశాలకు, లేదా ఆ ప్రాంతం మీదుగా ఇతర దేశాలకు బుక్ చేసుకున్న వారు తమ ప్రణాళికలను వాయిదా వేసుకుంటున్నట్లు ట్రావెల్ బుకింగ్ అగ్రిగేటర్ మేక్‌మైట్రిప్ తెలిపింది. ఆయా ఎయిర్‌లైన్స్ పాలసీల ప్రకారం తేదీలను మార్చుకునే విషయంలో సహాయ సహకారాలు అందిస్తున్నట్లు వివరించింది. అలాగే, అబుదాబి, దుబాయ్‌లో ప్రస్తుతం ఉన్న ట్రావెలర్లకు స్థానిక ప్రభుత్వాలు జారీ చేసే నోటిఫికేషన్ల ఆధారంగా అప్‌డేట్స్‌ని అందిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు నిశాంత్ పిట్టీ తెలిపారు. ప్రభావిత ప్రయాణికులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు ఒమన్ నుండి భారత్‌కి చార్టర్ ఫ్లయిట్స్ నడిపే యోచనలో ఉన్నట్లు వివరించారు. భౌగోళిక, రాజకీయ పరిస్థితులను బట్టి అంతర్జాతీయ ట్రావెల్‌కి స్వల్పకాలిక సవాళ్లు ఎదురైనా, దేశీయంగా మాత్రం టూరిజానికి డిమాండ్ పటిష్టంగానే కొనసాగవచ్చన్నారు.

**చమురు భగ్గు..**

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల దెబ్బతో ముడిచమురు సరఫరాపై నీలినీడలు కమ్ముకోవడంతో క్రూడాయిల్ ధరలు భగ్గుమన్నాయి. అంతర్జాతీయంగా ప్రామాణికమైన బ్రెంట్ క్రూడ్ రేటు బ్యారెల్‌కి 8.6 శాతం ఎగిసి 79.11 డాలర్లకు, నైమెక్స్ ఆయిల్ ధర 7.6 శాతం పెరిగి 72.12 డాలర్లకు ఎగిసింది. ప్రధాన సరఫరాదారైన ఖతర్ ఉత్పత్తి నిలిపివేయడంతో యూరప్‌లో సహజ వాయువు ధర 40 శాతం పైగా పెరిగింది. క్రూడాయిల్, గ్యాస్ రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధిలో ట్యాంకర్ల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడటంతో రేట్లు మరింత భారీగా పెరగొచ్చనే అంచనాలు నెలకొన్నాయి. హోర్ముజ్‌ని పూర్తిగా మూసివేస్తే ఆయిల్ ధర 90 డాలర్లు, అటు పైన 100 డాలర్లకి కూడా ఎగియొచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అదే జరిగితే అమెరికా సహా చాలా దేశాల్లో ద్రవ్యోల్బణం భారీగా పెరుగుతుందని విశ్లేషకులు తెలిపారు. ముడిచమురు ధరలు స్థిరంగా 15 డాలర్లు పెరిగితే, యూరప్‌లో ద్రవ్యోల్బణం అర శాతం మేర పెరుగుతుందని బెరెన్‌బర్గ్ బ్యాంక్ అంచనా వేసింది. ఈ పరిణామాలన్నీ ప్రపంచ వృద్ధిని దెబ్బతీస్తాయని పేర్కొంది. అయితే, అమెరికాలో నవంబర్‌లో మిడ్‌టర్మ్ ఎన్నికల ముందు ప్రతికూల పరిస్థితులను ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇష్టపడకపోవచ్చు కాబట్టి ఇంధన రేట్లను మళ్లీ కిందికి దింపేందుకు ప్రయత్నించవచ్చని తెలిపింది.



# పెట్టుబడులకు చక్కని వైవిధ్యం

పెట్టుబడులకు వైవిధ్యం ఎంతో అవసరం. దీని వల్ల నష్టాల రిస్క్‌ను గణనీయంగా తగ్గించుకోవచ్చు. అన్ని పెట్టుబడులను ఒకే చోట పెట్టడం కంటే.. వివిధ విభాగాల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల నష్టాల రిస్క తగ్గుతుంది. ఒకే ఫండ్‌తో చక్కని వైవిధ్యం కోరుకునే వారికి పరాగ్ పారిఖ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ చక్కగా సరిపోతుంది. దీర్ఘకాలంలో స్థిరమైన రాబడులతో, తక్కువ నష్టాల రిస్క్‌తో ఈ పథకం మెరుగ్గా రాణిస్తోంది. ఈ పథకానికి మంచి రాబడుల చరిత్రే ఉంది. ఈ పథకం 2013లో ఆరంభం కాగా, నాటి నుంచి నేటి వరకు ఏటా సగటున 19 శాతం చొప్పున రాబడులను అందించింది. గత ఐదేళ్లలోనూ రాబడి ఇదే స్థాయిలో ఉంది. మూడేళ్లలో మాత్రం ఏటా 20.94 శాతం చొప్పున, ఏడాది కాలంలో 10 శాతం మేర పెట్టుబడులపై ప్రతిఫలాన్ని అందించింది. ఫ్లెక్సీక్యాప్ విభాగం సగటు రాబడి కంటే 6 శాతం వరకు అధిక ప్రతిఫలం ఈ పథకంలోనే ఉండడం గమనించొచ్చు. మంచి రాబడుల అవకాశాలు ఎక్కడ ఉంటే అక్కడ ఇన్వెస్ట్ చేసే స్వేచ్ఛ ఈ ఫండ్‌కు ఉంది. స్థానిక కంపెనీలతో పాటు విదేశీ కంపెనీల్లోనూ ఇన్వెస్ట్ చేయడం ఈ పథకం పెట్టుబడుల విధానంలో భాగం. ముఖ్యంగా అమెరికాకు చెందిన దిగ్గజ టెక్నాలజీ కంపెనీల్లో ఈ పథకం చెప్పుకోతగ్గ స్థాయిలో ఇన్వెస్ట్ చేసింది. అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్, ఫేస్‌బుక్‌లో ఈ పథకానికి గణనీయమైన పెట్టుబడులు ఉన్నాయి. వ్యాల్యూ స్టాక్స్‌కు ఈ పథకం ప్రాధాన్యం ఇస్తుంటుంది. అంటే కంపెనీ వ్యాపారం, మూలాల పరంగా మంచి విలువ కలిగి, ఆకర్షణీయమైన ధరల్లో ఉన్నప్పుడు ఇన్వెస్ట్ చేయడం ద్వారా అధిక రాబడులు తెచ్చిపెట్టే వ్యూహాన్ని పాటిస్తోంది. వాస్తవ విలువలకు మించి గరిష్ట స్థాయిల్లో ట్రేడవుతున్న స్టాక్స్‌కు దూరంగా ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ రిస్క్‌ను సాధ్యమైనంత తగ్గించే విధంగా పనిచేస్తుంది. స్టాక్స్‌ను తరచూ మార్చదు. ఒక కౌంటర్‌లో దీర్ఘకాలం పాటు కొనసాగడాన్ని పాటిస్తుంది. స్థూల ఆర్థిక అంశాలు కాకుండా.. ఎంతో విలువ దాగున్న స్టాక్స్‌ను గుర్తించి పెట్టుబడులు పెడుతుంటుంది. పరిస్థితులకు అనుగుణంగా డెట్ సెక్యూరిటీలు, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లలో (రీట్)నూ ఇన్వెస్ట్ చేస్తుంటుంది. మధ్యకాల లక్ష్యాలకు (57 ఏళ్లు) దీర్ఘకాల లక్ష్యాలకు (10 ఏళ్లకు అంతకుమించి) ఈ పథకాన్ని ఎంపిక చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.1,33,970 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 77.32 శాతం ఈక్విటీల్లో, డెట్ సాధనాల్లో 13.71 శాతం, ఈక్విటీ హెడ్జింగ్ ఇన్‌స్ట్రుమెంట్లలో 2.53 శాతం, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్)లలో 1.33 శాతం చొప్పున పెట్టుబడులు పెట్టింది. 5.11 శాతం నగదు నిల్వలు ఉన్నాయి. రంగాల వారీ పెట్టుబడులను పరిశీలిస్తే.. అత్యధికంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు 33.80 శాతం, టెక్నాలజీ రంగ కంపెనీలకు 25.29 శాతం, కన్స్యూమర్ డిస్క్రిషనరీ కంపెనీలకు 7.48 శాతం చొప్పున కేటాయించింది. ప్రతినెలా రూ.1000 నుంచి సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

# నేను సైతం.. ప్రకృతి పరిరక్షణకు అనంత ప్రతిజ్ఞ

**జీవం ఉన్న ఏకైక గ్రహం భూమి మన అందరి సంయుక్త బాధ్యత**

**జీవవైవిధ్యం క్షీణతపై ప్రపంచానికి పెరుగుతున్న ఆందోళన**

**మానవ అభివృద్ధి ప్రకృతి సమతుల్యత మధ్య సంఘర్షణ**

**అంతరించిపోతున్న జాతులు భూమికి మౌన హెచ్చరిక**

**పర్యావరణ సంక్షోభం: కాలుష్యం, వాతావరణ మార్పు, అడవుల నరికివేత**

**వన్యప్రాణుల సంరక్షణలో ప్రజల పాత్ర కీలకం**

**ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం అవగాహనకు మేల్కొలుపు**

**“నేను సైతం” అనే సంకల్పమే భూమి భవిష్యత్తుకు భరోసా**



**అనంతమైన విశ్వంలో కోట్లాది గెలాక్సీలు, గ్రహాలు, నక్షత్రాలు ఉన్నప్పటికీ జీవం వికసించి, సమగ్ర జీవవైవిధ్యంతో కళకళలాడుతున్న ఏకైక గ్రహం మన భూమి. ఈ భూగోళంపైనే మనుషులు మాత్రమే కాకుండా సూక్ష్మజీవుల నుంచి భారీ జంతువుల వరకు అనేక రకాల జీవరాశులు పరస్పర సహజీవనంతో మనుగడ సాగిస్తున్నాయి. గాలి, నీరు, నేల, అడవులు, నదులు, సముద్రాలు, పర్వతాలు ఇవన్నీ కలసి ఒక సమగ్ర పర్యావరణ వ్యవస్థను నిర్మించాయి. ఈ వ్యవస్థలో ప్రతి జీవికి, ప్రతి మూలకానికి ప్రత్యేక స్థానం ఉంది. ఒకటి దెబ్బతింటే మొత్తం సమతుల్యత కదిలిపోతుంది. అందుకే ప్రకృతి పరిరక్షణ అనేది కేవలం ఒక నినాదం కాదు; అది మానవ మనుగడకు సంబంధించిన అత్యవసర బాధ్యత.**

జీవవైవిధ్యం అనేది భూమి యొక్క అసలు సంపద. మనం తినే ఆహారం, ధరించే వస్త్రాలు, ఉపయోగించే ఔషధాలు, శ్వాసించే ఆక్సిజన్ ఇవన్నీ ప్రకృతి నుంచి లభించే వరాలే. అడవులు కార్బన్‌ను గ్రహించి వాతావరణాన్ని సమతుల్యం చేస్తాయి. నదులు జీవానికి ఆధారం. పర్వతాలు వర్షపాతం చక్రాన్ని ప్రభావితం చేస్తాయి. వన్యప్రాణులు పర్యావరణ శ్రేణిని సమతుల్యంలో ఉంచుతాయి. ఈ పరస్పర ఆధార వ్యవస్థలో మనిషి కూడా ఒక భాగమే గాని అధిపతి కాదు. అయితే ఆధునిక యుగంలో మానవ కేంద్రిత అభివృద్ధి ప్రకృతి సమతుల్యతను తీవ్రంగా దెబ్బతీస్తోంది.

పారిశ్రామిక విప్లవం తర్వాత ప్రపంచ అభివృద్ధి వేగం పెరిగింది. సాంకేతిక పురోగతి, నగరీకరణ, పరిశ్రమల విస్తరణ, వినియోగ సంస్కృతి విపరీతంగా పెరిగాయి. అభివృద్ధి అవసరమే అయినప్పటికీ అది ప్రకృతితో సమన్వయంగా సాగాల్సింది. కానీ అధిక వినియోగం, సహజ వనరుల దోపిడీ, అనియంత్రిత తవ్వకాలు, అడవుల నరికివేత వంటి చర్యలు పర్యావరణంపై తీవ్ర ఒత్తిడిని సృష్టించాయి. అడవులను నరికివేసి కాంక్రీట్ అరణ్యాలు నిర్మించడం వల్ల జీవుల నివాసాలు నశిస్తున్నాయి. వేట, అక్రమ వన్యప్రాణి వ్యాపారం వల్ల అరుదైన జాతులు అంతరించిపోతున్నాయి.

కాలుష్యం పర్యావరణానికి అతిపెద్ద శత్రువుగా మారింది. గాలి కాలుష్యం నగరాల్లో శ్వాసకోశ వ్యాధులకు కారణమవుతోంది. నీటి కాలుష్యం నదులను, సరస్సులను విషపూరితం చేస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్ర జీవులను ప్రమాదంలోకి నెడుతున్నాయి. నేల కాలుష్యం వ్యవసాయ ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ కాలుష్య ప్రభావం కేవలం ప్రకృతిపైనే కాదు, మానవ ఆరోగ్యంపైన కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది.

వాతావరణ మార్పు కూడా మరో ప్రధాన సంక్షోభంగా మారింది. గ్లోబల్ వార్మింగ్ కారణంగా భూమి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. హిమనదులు కరుగుతున్నాయి. సముద్ర మట్టం పెరుగుతోంది. అకాల వర్షాలు, తీవ్ర కరువులు, తుఫానులు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్నాయి. ఇవన్నీ మానవ కార్యకలాపాల ఫలితమేనని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రకృతి హెచ్చరికలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ ప్రపంచం ఇంకా పూర్తిగా మేల్కొనలేదు.

అడవులు ప్రకృతి ఊపిరితిత్తులుగా భావించబడతాయి. కానీ ప్రపంచవ్యాప్తంగా అడవుల విస్తీర్ణం తగ్గిపోతోంది. అరణ్య నిర్మూలన వల్ల కేవలం చెట్లు మాత్రమే కాదు, వేలాది జీవుల నివాసాలు నశిస్తున్నాయి. ఒక అడవి నశిస్తే దానితో పాటు జీవవైవిధ్యం కూడా క్షీణిస్తుంది. పర్యావరణ సమతుల్యత కదిలిపోతుంది. వర్షపాతం చక్రం మారుతుంది. నేల ఎరువుదనం తగ్గుతుంది. ఈ ప్రభావం చివరకు వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ, ఆహార భద్రతపై కూడా పడుతుంది.

వన్యప్రాణుల పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది. పులులు, ఏనుగులు, ఖడ్గమృగాలు, చిరుతలు, సముద్ర జీవులు వంటి అనేక జాతులు అంతరించిపోతున్న జాబితాలో చేరాయి. అక్రమ వేట, నివాసాల నష్టం, వాతావరణ మార్పు, కాలుష్యం వంటి కారణాలు వాటి మనుగడకు ముప్పుగా మారాయి. ఒక జీవి అంతరించిపోవడం అనేది ప్రకృతి శ్రేణిలో ఒక ముఖ్యమైన క్రమం విరిగిపోవడమే. దీని ప్రభావం మొత్తం పర్యావరణ వ్యవస్థపై పడుతుంది.

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతున్నప్పటికీ అమలు స్థాయిలో ఇంకా చాలా చేయాల్సి ఉంది. ప్రభుత్వాలు చట్టాలు రూపొందిస్తున్నాయి. అంతర్జాతీయ ఒప్పందాలు కుదురుతున్నాయి. పర్యావరణ సదస్సులు నిర్వహిస్తున్నాయి. అయినప్పటికీ ప్రజల భాగస్వామ్యం లేకుండా ప్రకృతి పరిరక్షణ సాధ్యం కాదు. ప్రతి వ్యక్తి తన దైనందిన జీవితంలో చిన్నచిన్న మార్పులు చేస్తే పెద్ద ఫలితాలు సాధ్యమవుతాయి.

నీటి సంరక్షణ అత్యంత కీలక అంశం. భవిష్యత్తులో నీటి కొరత తీవ్రమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వర్షపు నీటి సంరక్షణ, నీటి వృథా తగ్గించడం, చెరువులు, కుంటలు పునరుద్ధరణ వంటి చర్యలు అత్యవసరం. అలాగే చెట్లను నాటడం, పచ్చదనాన్ని పెంపొందించడం పర్యావరణ సమతుల్యతకు కీలకం. ప్రతి ఒక్కరూ జీవితంలో కనీసం కొన్ని చెట్లు నాటితే భూమికి పెద్ద సేవ చేసినట్టే.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం కూడా ప్రకృతి పరిరక్షణలో కీలక అంశం. ఒకసారి ఉపయోగించే ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి భారీ నష్టం జరుగుతోంది. పర్యావరణహిత ఉత్పత్తులను వినియోగించడం, వ్యర్థాలను వర్గీకరించడం, పునర్వినియోగం చేయడం వంటి అలవాట్లు అలవరచుకోవాలి. ఇవి చిన్న చర్యలుగా కనిపించినా దీర్ఘకాలంలో భారీ మార్పును తీసుకొస్తాయి.

పర్యావరణ పరిరక్షణలో విద్య కీలక పాత్ర పోషిస్తుంది. చిన్నప్పటి నుంచే పిల్లల్లో ప్రకృతి పట్ల ప్రేమ, బాధ్యతాభావం పెంపొందించాలి. పాఠశాలలు, కళాశాలల్లో పర్యావరణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రకృతి పట్ల గౌరవం పెరిగితేనే భవిష్యత్ తరాలు పచ్చని భూమిని నిర్మించగలవు.

ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 3న జరుపుకోవడం వెనుక ఉన్న ఉద్దేశం కూడా ఇదే. వన్యప్రాణుల సంరక్షణ ప్రాముఖ్యతను ప్రపంచానికి గుర్తుచేయడం. జీవవైవిధ్య పరిరక్షణపై అవగాహన పెంచడం. ప్రకృతి, జీవరాశుల మధ్య ఉన్న అనుబంధాన్ని అర్థం చేసుకోవడం. ఈ దినోత్సవం కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు; అది మానవాళికి ప్రకృతి ఇచ్చే మేల్కొలుపు పిలుపు.

మనిషి ప్రకృతికి యజమాని కాదని, సహజీవి మాత్రమేనని గుర్తించాల్సిన సమయం వచ్చింది. అభివృద్ధి మరియు ప్రకృతి పరిరక్షణ మధ్య సమతుల్యత అవసరం. సుస్థిర అభివృద్ధి అనే భావనను ఆచరణలో అమలు చేయాలి. సహజ వనరులను సమర్థంగా వినియోగిస్తూ భవిష్యత్ తరాలకు భద్రపరచాలి.

“నేను సైతం” అనే సంకల్పం ప్రతి పౌరుడిలో కలగాలి. ప్రకృతిని కాపాడటం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు; ప్రతి మనిషి కర్తవ్యం. చెట్టు నాటడం నుంచి నీటి సంరక్షణ వరకు, ప్లాస్టిక్ తగ్గించడం నుంచి వన్యప్రాణుల రక్షణ వరకు ప్రతి చిన్న చర్య కూడా భూమి భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది.

భూమి మనకు వారసత్వంగా వచ్చిన ఆస్తి కాదు; మన పిల్లల నుంచి అప్పుగా తీసుకున్న సంపద. ఈ గ్రహాన్ని పచ్చగా, పరిశుభ్రంగా, జీవవైవిధ్యంతో నిండినదిగా భద్రపరచడం మన నైతిక బాధ్యత. ప్రకృతి మనకు అన్నీ ఇస్తోంది. కానీ మనం దానిని కాపాడటంలో విఫలమైతే భవిష్యత్ తరాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటాయి.

కాబట్టి ఇప్పుడే చర్యలు ప్రారంభించాలి. ప్రకృతితో సమన్వయం కలిగిన జీవనశైలిని అలవరచుకోవాలి. పర్యావరణ పరిరక్షణను జీవిత భాగంగా మార్చుకోవాలి. ప్రతి ఒక్కరూ “నేను సైతం ప్రకృతి పరిరక్షణకు అంకితం” అనే సంకల్పంతో ముందుకు వస్తేనే భూమి భవిష్యత్తు సురక్షితం అవుతుంది. ఇదే నిజమైన అభివృద్ధి, ఇదే నిజమైన మనుగడ, ఇదే భూమికి మనం ఇవ్వగలిగే అత్యుత్తమ

## ఈ ఆహారాలను రోజూ తీసుకోండి.. శరీర రోగ నిరోధక శక్తి సహజసిద్ధంగా పెరుగుతుంది..



శరీరానికి రోగనిరోధక శక్తి ఉండడం చాలా అవసరం. తగినంత రోగనిరోధక శక్తి కలిగి ఉండడం వల్ల ఇన్ఫెక్షన్ ల బారిన పడకుండా ఉంటారు. అలాగే అనారోగ్య సమస్యల నుండి త్వరగా కోలుకోవచ్చు. అయితే ఈ రోగనిరోధక శక్తి రాత్రికి రాత్రే శరీరంలో తయారవ్వదు. ప్రతిరోజూ తీసుకునే ఆహారాల ద్వారా శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చు. బలమైన రోగనిరోధక శక్తి విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు, పొట్టలో ఉండే మంచి బ్యాక్టీరియాపై ఆధారపడి ఉంటుంది. రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి మందులు, ఖరీదైన ఉత్పత్తులను వాడాల్సిన అవసరం లేదు. రోజూ తీసుకునే భోజనం ద్వారా కూడా రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చు. సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఇన్ఫెక్షన్ లతో పోరాడే శక్తిని, అనారోగ్యానికి గురి అయినప్పుడు త్వరగా కోలుకునే శక్తిని పొందవచ్చు. రోగనిరోధక శక్తిని సహజంగా పెంచే కొన్ని రకాల ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**పండ్లు, కూరగాయలు..**

నారింజ, నిమ్మకాయలు, బెర్రీలు, పాలకూర, క్యారెట్ వంటి ఆహారాలు విటమిన్ ఎ, సి వంటి పోషకాలను కలిగి ఉంటాయి. వీటితో పాటు రోగనిరోధక శక్తికి మద్దతును ఇచ్చే యాంటీ ఆక్సిడెంట్లను కూడా కలిగి ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. వెల్లుల్లి, అల్లం, పసుపు వంటి పదార్థాలు శరీరం వాపుతో పోరాడడానికి, సహజ రక్షణ ప్రతిస్పందనలకు కావల్సిన మద్దతును ఇస్తాయి. పెరుగు వంటి ఆహారాలను తీసుకోవడం వల్ల పేగు ఆరోగ్యం మెరుగుపడుతుంది. చక్కటి పేగు ఆరోగ్యం రోగనిరోధక శక్తిలో కీలక పాత్ర పోషిస్తుంది. గింజలు, విత్తనాలు వంటి ఆహారాలు జింక్, విటమిన్ ఇలతో పాటు ఆరోగ్యకరమైన కొవ్వులను కలిగి ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తికి మద్దతు ఇవ్వడంలో సహాయపడతాయి.

**అల్లం, పసుపు..**

అలాగే భోజన విషయంలో చాలా మంది చేసే చిన్న ఎంపికలే పెద్ద తేడాను కలిగిస్తాయి. భోజనంలో పండ్లు, కూరగాయలతో పాటు వంటలల్లో పసుపు, అల్లం వంటి వాటిని జోడించడం వల్ల రోగనిరోధక శక్తి క్రమంగా పెరుగుతుంది. అలాగే గుడ్లు, కాయ ధాన్యాలు వంటి ప్రోటీన్ ఉండే ఆహారాలు రోగనిరోధక కణాలను మరమ్మత్తు చేయడంలో వాటిని నిర్మించడంలో దోహదపడతాయి. ఇక ఆహారం ద్వారా రోగనిరోధక శక్తి పెరగడానికి రెండు నుండి నాలుగు వారాల సమయం పడుతుంది. అయితే సమతుల్య ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం చాలా ముఖ్యం. ఇటువంటి ఆహారాలను తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తి మెరుగుపడడంతో పాటు జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుందని, శరీరానికి కావల్సిన శక్తి లభిస్తుందని వైద్యులు చెబుతున్నారు.



## బొప్పాయి బ్రేక్‌ఫాస్ట్

ప్రస్తుతం చాలామంది పండ్ల ముక్కల్నే ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకుంటున్నారు. అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందుతున్నారు. అలాంటివారు అల్పాహారంగా బొప్పాయిని తీసుకుంటే, మరిన్ని ఉపయోగాలు ఉంటాయని నిపుణులు సెలవిస్తున్నారు. ఉదయాన్నే ఖాళీ కడుపుతో బొప్పాయి తీసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరిస్తున్నారు. బొప్పాయిలోని ‘పాపైన్’ అనే ఎంజైమ్.. ప్రొటీన్లను సులభంగా విచ్ఛిన్నం చేస్తుంది. జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. ఉదయాన్నే బొప్పాయిని తినడం వల్ల.. రోజంతా జీర్ణక్రియ సజావుగా సాగుతుంది. ఇక బొప్పాయిలో పీచు పదార్థం, నీటి శాతం అధికం. ఇది పేగుల కదలికలను మెరుగుపరిచి, మలబద్ధకం సమస్యను సహజసిద్ధంగానే తగ్గిస్తుంది. బొప్పాయిని రెగ్యులర్‌గా తీసుకుంటే.. గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలు తగ్గుతాయి. అంతేకాకుండా, బొప్పాయిలో కేలరీలు తక్కువ. ఇది తిన్న తర్వాత కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తుంది. కాబట్టి, బరువు తగ్గాలనుకునే వారికీ మంచి ఎంపిక. ఇందులో ఉండే విటమిన్ సి.. శరీరానికి అవసరమైన రోగనిరోధక శక్తిని అందిస్తుంది. ఇది ఇన్ఫెక్షన్ల బారి నుంచి కాపాడుతుంది. బొప్పాయిలోని ఫైబర్, పొటాషియం.. రక్తపోటును నియంత్రించడంతోపాటు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలోనూ ముందుంటాయి. ఫలితంగా, హృదయ సంబంధ సమస్యలు రాకుండా ఉంటాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు.. చర్మాన్ని మెరిసేలా చేస్తాయి. వృద్ధాప్య ఛాయల్ని అడ్డుకుంటాయి. ఇలా.. బొప్పాయిని అల్పాహారంగా తీసుకుంటే, ఆరోగ్యంతోపాటు అందం కూడా సొంతమవుతుంది.

# ఛత్తీస్‌గఢ్ మరియు తెలంగాణలో నక్సలిజం
# చరిత్ర, ప్రభావం, రాజకీయ-సామాజిక సవాళ్లు

నక్సలిజం అనే పదం భారత దేశ రాజకీయ, సామాజిక చరిత్రలో ఒక క్లిష్టమైన, వివాదాస్పదమైన మరియు బహుముఖ అంశంగా నిలిచింది. ఇది కేవలం ఒక భద్రతా సమస్య మాత్రమే కాదు; ఇది సామాజిక అసమానతలు, భూసంబంధ సమస్యలు, గిరిజనుల హక్కులు, అభివృద్ధి లోపాలు, రాజకీయ నిర్లక్ష్యం మరియు ఆర్థిక అసమానతల సంక్లిష్ట సమ్మేళనంగా చూడాల్సిన అంశం. ముఖ్యంగా మధ్య భారత అరణ్య ప్రాంతాలు, గిరిజన ఆధారిత సమాజాలు ఉన్న ప్రాంతాలలో నక్సలిజం ఒక ఉద్యమంగా పుట్టి, తరువాత సాయుధ ఉద్యమంగా మారి, ప్రభుత్వ వ్యవస్థకు సవాల్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ మరియు తెలంగాణ రాష్ట్రాలు నక్సలిజం చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించాయి.



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దండకారణ్య అరణ్య ప్రాంతాలు నక్సలిజం ప్రధాన కేంద్రాలుగా చాలా కాలంగా గుర్తింపు పొందాయి. ఈ ప్రాంతాలలో గిరిజనులు అధిక సంఖ్యలో నివసించడం, వారి జీవన విధానం ప్రకృతి ఆధారితంగా ఉండటం, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు తక్కువగా ఉండటం వంటి అంశాలు ఉద్యమానికి బలమైన పునాది వేశాయి. అభివృద్ధి అనే పేరుతో జరిగే ఖనిజ తవ్వకాలు, భూసేకరణ, అరణ్య హక్కుల సమస్యలు గిరిజనులలో అసంతృప్తిని పెంచాయి. ఈ అసంతృప్తిని సాయుధ ఉద్యమాలు తమ సిద్ధాంతాలకు అనుకూలంగా మలచుకున్నాయి. స్థానిక సమస్యలను రాజకీయ-విప్లవ సిద్ధాంతాలతో మిళితం చేసి నక్సలిజం ఒక ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగింది.

తెలంగాణలో నక్సలిజం చరిత్ర మరింత పురాతనమైనది. పాత హైదరాబాద్ రాష్ట్ర కాలంలోనే భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు, రైతాంగ తిరుగుబాట్లు ప్రారంభమయ్యాయి. తెలంగాణ సాయుధ పోరాటం భారత స్వాతంత్ర్యానంతర కాలంలో ఒక ప్రముఖ సంఘటనగా నిలిచింది. ఆ ఉద్యమం సామాజిక న్యాయం, భూసంస్కరణలు, రైతుల హక్కులు వంటి అంశాల చుట్టూ తిరిగింది. తరువాత కాలంలో అదే సిద్ధాంత ధోరణులు నక్సలిజం రూపంలో పునరుద్భవించాయి. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం, నిరుద్యోగం, సామాజిక వివక్ష, భూసంబంధ సమస్యలు ఈ ఉద్యమానికి ప్రేరణగా మారాయి.

నక్సలిజం పుట్టుకను పూర్తిగా అర్థం చేసుకోవాలంటే భారతదేశంలో సామాజిక అసమానతల చరిత్రను పరిశీలించాల్సి ఉంటుంది. గిరిజనులు మరియు అరణ్య ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా అభివృద్ధి ప్రక్రియలో వెనుకబడిన వర్గాలుగా మిగిలిపోయారు. ప్రభుత్వ విధానాలు తరచుగా వారికి చేరకపోవడం, స్థానిక పరిపాలన వ్యవస్థలు బలహీనంగా ఉండటం, విద్యా అవకాశాల లోపం, ఆరోగ్య సదుపాయాల కొరత వంటి అంశాలు వారి జీవన ప్రమాణాలను ప్రభావితం చేశాయి. ఈ ఖాళీని నక్సలైట్ గ్రూపులు తమ సిద్ధాంత ప్రచారంతో నింపాయి.

ఛత్తీస్‌గఢ్‌లో గిరిజన ప్రాంతాల్లో నక్సలిజం ఒక పరిపాలనా ప్రత్యామ్నాయ వ్యవస్థలా కూడా పనిచేసిన సందర్భాలు ఉన్నాయి. గ్రామ స్థాయిలో సమస్యలను పరిష్కరించడం, స్థానిక వివాదాలలో జోక్యం చేసుకోవడం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం ద్వారా ప్రజల్లో తమ ప్రభావాన్ని పెంచుకున్నారు. అయితే ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రత్యక్ష సవాల్‌గా నిలిచింది. ఎన్నికల ప్రక్రియలను బహిష్కరించడం, ప్రభుత్వ నిర్మాణాలపై దాడులు చేయడం వంటి చర్యలు రాష్ట్ర స్థిరత్వానికి ప్రమాదకరంగా మారాయి.

తెలంగాణలో గత రెండు దశాబ్దాలలో నక్సలిజం ప్రభావం గణనీయంగా తగ్గినప్పటికీ, దాని సామాజిక మూలాలు పూర్తిగా తొలగిపోయాయని చెప్పలేము. ప్రభుత్వ కఠిన చర్యలు, ప్రత్యేక పోలీస్ దళాల ఏర్పాటు, అభివృద్ధి కార్యక్రమాల విస్తరణ, రాజకీయ చర్చలు వంటి బహుముఖ వ్యూహాలు ఈ తగ్గుదలకు కారణమయ్యాయి. అయితే భూసంబంధ సమస్యలు, గిరిజన హక్కుల అంశాలు ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదు.

నక్సలిజాన్ని కేవలం చట్ట-వ్యవస్థ సమస్యగా మాత్రమే చూడటం సరైన దృక్కోణం కాదు. ఇది ఒక సామాజిక-ఆర్థిక అసంతృప్తి యొక్క వ్యక్తీకరణ కూడా. అభివృద్ధి అసమానతలు ఉన్న ప్రాంతాల్లో తీవ్రవాద సిద్ధాంతాలు వేగంగా వ్యాపిస్తాయి. ఛత్తీస్‌గఢ్‌లో మౌలిక వసతుల కొరత, రహదారుల లోపం, విద్యా సౌకర్యాల కొరత, ఆరోగ్య సేవల పరిమిత ప్రాప్తి వంటి అంశాలు ప్రజలను ప్రభుత్వ వ్యవస్థపై అనుమానంతో చూడేలా చేశాయి. ఈ పరిస్థితుల్లో సాయుధ ఉద్యమాలు "ప్రజల రక్షకులు" అనే భావనను సృష్టించడానికి ప్రయత్నించాయి.

అదే సమయంలో నక్సలిజం వల్ల జరిగిన హింసను విస్మరించడం కూడా సమంజసం కాదు. పోలీసు సిబ్బంది, సాధారణ పౌరులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు హింసకు బలైన సంఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. మౌలిక వసతుల ధ్వంసం, రహదారి ప్రాజెక్టులపై దాడులు, విద్యాసంస్థలపై దాడులు అభివృద్ధి ప్రక్రియను తీవ్రంగా దెబ్బతీశాయి. హింసాత్మక పోరాటం చివరికి ప్రజలకే నష్టం కలిగిస్తుంది.

ప్రభుత్వం చేపట్టిన భద్రతా చర్యలు కూడా వివాదాలకు దారి తీసిన సందర్భాలు ఉన్నాయి. కఠిన చర్యలు అవసరమైనప్పటికీ, అవి మానవ హక్కులను గౌరవించే విధంగా ఉండాలి. కొన్ని సందర్భాల్లో భద్రతా చర్యలు స్థానిక ప్రజలలో భయం, అనిశ్చితిని పెంచాయి. అందువల్ల భద్రతా చర్యలు మరియు అభివృద్ధి కార్యక్రమాలు సమాంతరంగా అమలు కావాలి.

తెలంగాణలో ఒక ముఖ్యమైన మార్పు అభివృద్ధి ఆధారిత వ్యూహం. గ్రామీణ మౌలిక వసతుల మెరుగుదల, సాగునీటి ప్రాజెక్టులు, విద్యా విస్తరణ, స్వయం ఉపాధి పథకాలు వంటి చర్యలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలపరిచాయి. అభివృద్ధి జరిగే కొద్దీ తీవ్రవాద సిద్ధాంతాలకు ఆకర్షణ తగ్గుతుంది. ఇది ఒక కీలక పాఠం. ఛత్తీస్‌గఢ్‌లో కూడా ఇటీవల అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం పెరిగింది. రోడ్లు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, డిజిటల్ కనెక్టివిటీ వంటి అంశాలు క్రమంగా విస్తరిస్తున్నాయి. అయితే అరణ్య ప్రాంతాల్లో అభివృద్ధి అమలు సవాళ్లతో కూడుకున్నది. భౌగోళిక పరిస్థితులు, భద్రతా సమస్యలు, పరిపాలనా పరిమితులు ఈ ప్రక్రియను నెమ్మదింపజేస్తున్నాయి. నక్సలిజం సమస్యను పరిష్కరించడానికి సంభాషణ కూడా ఒక మార్గంగా పరిగణించబడింది. గతంలో కొన్ని సందర్భాల్లో చర్చలు జరిగాయి. అయితే అవి స్థిరమైన పరిష్కారానికి దారి తీసే స్థాయిలో విజయవంతం కాలేదు. సాయుధ ఉద్యమాలు తమ సిద్ధాంతాలను పూర్తిగా విడిచిపెట్టకపోవడం, ప్రభుత్వం హింసను అంగీకరించలేని స్థితి వంటి అంశాలు చర్చలకు అడ్డంకులయ్యాయి. సామాజిక న్యాయం అనే అంశం నక్సలిజం చర్చలో కీలకమైనది. భూసంస్కరణలు, గిరిజన హక్కుల పరిరక్షణ, అరణ్య హక్కుల చట్టాల సమర్థ అమలు వంటి అంశాలు ప్రజల విశ్వాసాన్ని పెంచగలవు. అభివృద్ధి ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పును తీసుకురావాలి. కేవలం గణాంకాల అభివృద్ధి సరిపోదు; జీవన ప్రమాణాల మెరుగుదల ముఖ్యమైనది.

మీడియా పాత్ర కూడా ఈ సమస్యలో కీలకం. నక్సలిజాన్ని కేవలం భద్రతా కోణంలో మాత్రమే చూపించడం వల్ల సమస్య యొక్క మూలాలు కనిపించకుండా పోతాయి. సమగ్ర విశ్లేషణ, గిరిజనుల వాస్తవ పరిస్థితులపై నివేదికలు, అభివృద్ధి లోపాలపై చర్చలు అవసరం. ప్రజాస్వామ్య సమాజంలో సమాచార పారదర్శకత అత్యంత ముఖ్యమైనది. యువత ఆకర్షణ కూడా ఒక ముఖ్య అంశం. నిరుద్యోగం, అవకాశాల కొరత ఉన్న ప్రాంతాల్లో తీవ్రవాద సిద్ధాంతాలు యువతను ఆకర్షించగలవు. విద్యా విస్తరణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలు ఈ సమస్యను తగ్గించగలవు. తెలంగాణలో ఐటీ, పరిశ్రమల అభివృద్ధి వల్ల యువతకు ప్రత్యామ్నాయ అవకాశాలు పెరిగాయి, ఇది ఒక పాజిటివ్ మార్పు.

గిరిజన సంస్కృతి పరిరక్షణ కూడా కీలకం. అభివృద్ధి పేరుతో స్థానిక సంస్కృతిని దెబ్బతీయడం అసంతృప్తికి దారి తీస్తుంది. స్థానిక సంప్రదాయాలు, జీవన విధానాలను గౌరవించే అభివృద్ధి నమూనాలు అవసరం. సమగ్ర అభివృద్ధి అంటే ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమతుల్యత. నక్సలిజం సమస్యలో రాజకీయ అంశం కూడా ఉంది. కొన్ని సందర్భాల్లో రాజకీయ పార్టీలు ఈ అంశాన్ని రాజకీయ లాభాల కోసం ఉపయోగించుకున్నాయి. దీని వల్ల సమస్యకు స్థిరమైన పరిష్కారం ఆలస్యం అయింది. దీర్ఘకాలిక వ్యూహం అవసరం, తాత్కాలిక రాజకీయ లాభాల కంటే ప్రజల సంక్షేమం ముఖ్యమైనది.


భవిష్యత్ దిశలో చూస్తే, కేవలం సైనిక చర్యలు సరిపోవు. అభివృద్ధి, సంభాషణ, సామాజిక న్యాయం, పరిపాలనా సంస్కరణలు కలిసి పనిచేయాలి. స్థానిక ప్రజలను భాగస్వామ్యంగా చేసుకునే పాలన వ్యవస్థ అవసరం. గ్రామ స్థాయిలో ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక నాయకులు కలిసి పనిచేస్తే సమస్య పరిష్కారం సాధ్యమవుతుంది.

సాంకేతిక పరిజ్ఞానం వినియోగం కూడా కీలకమైనది. డిజిటల్ కనెక్టివిటీ, ఆన్‌లైన్ విద్య, టెలీమెడిసిన్ వంటి కార్యక్రమాలు అరణ్య ప్రాంతాల్లో జీవన ప్రమాణాలను మెరుగుపరచగలవు. సమాచార ప్రాప్తి పెరిగినప్పుడు తీవ్రవాద సిద్ధాంతాల ప్రభావం తగ్గుతుంది. చివరగా, నక్సలిజం సమస్యను సమగ్ర దృక్కోణంతో చూడాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం చట్ట-వ్యవస్థ సమస్య కాదు; ఇది అభివృద్ధి, సామాజిక న్యాయం, రాజకీయ బాధ్యతల పరీక్ష. ఛత్తీస్‌గఢ్ మరియు తెలంగాణ అనుభవాలు ఒక ముఖ్యమైన పాఠాన్ని చెబుతున్నాయి: ప్రజల సమస్యలను పట్టించుకోని అభివృద్ధి నమూనాలు అసంతృప్తికి దారి తీస్తాయి, కానీ సమగ్ర అభివృద్ధి శాంతికి మార్గం చూపుతుంది. హింసకు బదులుగా సంభాషణ, నిర్లక్ష్యానికి బదులుగా అభివృద్ధి, అసమానతకు బదులుగా న్యాయం ఇవే దీర్ఘకాలిక పరిష్కారం కోసం అవసరమైన మూడు స్థంభాలు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉన్నప్పుడు, ప్రజల విశ్వాసం పెరిగినప్పుడు, నక్సలిజం వంటి తీవ్రవాద ధోరణులు సహజంగానే బలహీనపడతాయి. భారతదేశ భవిష్యత్ శాంతి, స్థిరత్వం, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే ఈ సమస్యను సహనంతో, దూరదృష్టితో, మానవీయ దృక్కోణంతో పరిష్కరించడం అత్యవసరం.

# వైవాహిక వ్యవస్థకు మారుతున్న సామాజిక నిర్వచనాలు
# స్వేచ్ఛ మరియు బాధ్యతల మధ్య యువత అంతర్మథనం

వివాహమే జీవితాన మరపురాని మహోదయం అన్నాడు ఒక భావుకుడు. మానవ నాగరికత పరిణామ క్రమంలో స్త్రీ, పురుషుల మధ్య సంబంధాన్ని క్రమబద్ధీకరించడానికి, ఒక పవిత్రమైన బంధంగా మలచడానికి సమాజం ఏర్పరిచిన అత్యున్నత వ్యవస్థ వివాహం. యుక్త వయస్కులు తమ జీవితాల్లో ఒక స్థిరత్వాన్ని, సామాజిక గుర్తింపును పొందడానికి వివాహాన్ని మించిన మార్గం మరొకటి లేదని మన పెద్దలు తరతరాలుగా నమ్ముతూ వస్తున్నారు. అయితే, మారుతున్న కాలంతో పాటు ఈ పురాతన వ్యవస్థ ఇప్పుడు సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ఒకప్పుడు కుటుంబ గౌరవానికి, వంశాభివృద్ధికి ప్రతీకగా నిలిచిన వివాహ బంధం, నేడు వ్యక్తిగత స్వేచ్ఛ, ఆధునిక జీవనశైలి మరియు సాంకేతిక విప్లవం ధాటికి తన రూపురేఖలను మార్చుకుంటోంది. ప్రస్తుత సమాజంలో వివాహం అనేది కేవలం ఒక సంప్రదాయంగా కాకుండా, రకరకాల సామాజిక, మానసిక సమస్యల నిలయంగా మారుతుండటం గమనార్హం. ఓవైపు స్వలింగ సంబంధాలు చట్టబద్ధత కోసం పోరాడుతుంటే, మరోవైపు సహజీవనం (లివ్-ఇన్ రిలేషన్ షిప్) వంటి ధోరణులు నగరాల్లో విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయి. ఇవి ఒకప్పుడు పాశ్చాత్య దేశాలకే పరిమితమని భావించినప్పటికీ, నేడు భారతీయ సమాజపు మూలాల్లోకి చొచ్చుకుపోతున్నాయి. ఇది కేవలం నైతిక విలువల పతనం మాత్రమే కాదు, సామాజిక నిర్మాణం ఎదుర్కొంటున్న ఒక లోతైన సంక్షోభం అని చెప్పక తప్పదు. ముఖ్యంగా 'జెన్ జీ' (+వల్గ) అని పిలవబడే నేటి యువతలో వివాహానికి పూర్వమే భౌతిక సంబంధాలు పెట్టుకోవడం అనేది ఒక సహజమైన అంశంగా మారుతున్నట్లు ఇటీవలి అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.





పెండ్లిళ్లు ఆలస్యంగా కావడం, ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లడం లేదా కెరీర్ పట్ల అమితమైన శ్రద్ధ చూపడం వంటి కారణాల వల్ల వివాహ వయస్సు పెరుగుతోంది. ఈ క్రమంలో ఏర్పడే ఒంటరితనం, ఇంటర్నెట్ మరియు సోషల్ మీడియా విస్తృతి యువతను వివాహేతర లేదా వివాహ పూర్వ సంబంధాల వైపు మళ్లిస్తున్నాయి. భారతీయ సంప్రదాయంలో పెళ్లి సమయంలో 'నాతిచరామి' (ధర్మం, అర్థం, కామాల్లో తోడుంటాను) అని ప్రమాణం చేస్తారు. కానీ, నేటి కాలంలో పెళ్లికి ముందే 'అతిచరామి' (హద్దులు దాటడం) అనే ధోరణి పెరగడం ఆందోళన కలిగించే విషయం. ఆధునిక యుగంలో ఇద్దరు వయోజనులు పరస్పర అంగీకారంతో తీసుకునే నిర్ణయాలను తప్పుబట్టడం చట్టరీత్యా సాధ్యం కాకపోవచ్చు, కానీ అది సామాజికంగా తెచ్చే మార్పులను గమనించాలి. విభిన్న లైంగిక ధోరణులు, సహజీవన వ్యవస్థలను సాధారణీకరిస్తున్న ఈ కాలంలో, నైతికత అనే పదం కొత్త నిర్వచనాలను వెతుక్కుంటోంది. గణాంకాలను పరిశీలిస్తే, ఈ మార్పు దేశమంతటా ఒకేలా లేదు. విచిత్రంగా, దక్షిణ భారతదేశంలో ఈ ధోరణి ఉత్తరాది కంటే తక్కువగా ఉండటం గమనార్హం. కేరళ, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో సంప్రదాయ విలువలు ఇంకా కొంత బలంగానే ఉన్నాయని ఈ అంకెలు చెబుతున్నాయి. అయితే, ఐటీ రంగం, బీపీఓ రంగాల్లో పనిచేసే వారిలో ఈ ధోరణి ఎక్కువగా ఉండటం చూస్తుంటే, ఆర్థిక స్వతంత్రం మరియు పని ఒత్తిడి కూడా సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయని అర్థమవుతుంది.

సమాజంలో సగం మంది ఇప్పటికీ వివాహ పూర్వ సంబంధాలను ఒక కళంకంగానే చూస్తున్నారు. ముఖ్యంగా మహిళల విషయంలో సమాజం చూపే వివక్ష ఇంకా తొలగిపోలేదు. ఒక పురుషుడు ఇటువంటి సంబంధాల్లో ఉంటే దానిని తేలికగా తీసుకునే సమాజం, మహిళల విషయంలో మాత్రం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. ఈ అప్రతిష్ఠ వల్ల మహిళలే మానసికంగా ఎక్కువ కుంగిపోతున్నారు. యువత ఆలోచనా విధానంలో వస్తున్న మార్పులు ఆశ్చర్యకరంగా ఉన్నాయి. దాదాపు మూడో వంతు యువతీ యువకులు పెళ్లికి ముందు శారీరక సాన్నిహిత్యం తప్పేమీ కాదని భావిస్తుండటం ఒక కొత్త సామాజిక ముఖచిత్రాన్ని ఆవిష్కరిస్తోంది. చట్టపరంగా చూస్తే, సుప్రీంకోర్టు అనేకసార్లు వయోజనుల మధ్య పరస్పర అంగీకారంతో జరిగే సంబంధాలు నేరం కాదని స్పష్టం చేసింది. అయితే, ఇటీవలి కాలంలో న్యాయస్థానాలు యువతకు హితవు పలకడం గమనార్హం. వివాహానికి ముందే అపరిచితులతో భౌతిక సంబంధాలు పెట్టుకునేటప్పుడు ఆచితూచి అడుగు వేయాలని, అది కేవలం శారీరక అవసరమే కాకుండా జీవితాంతం వెంటాడే భావావేశ సమస్యలకు దారితీస్తుందని హెచ్చరిస్తున్నాయి. ప్రేమ పేరుతోనో, పెళ్లి చేసుకుంటామనే వాగ్దానంతోనో మోసం చేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా మహిళలు తమ విచక్షణను ఉపయోగించాలని కోర్టులు సూచిస్తున్నాయి. వివాహ పూర్వ సంబంధాలు భవిష్యత్తులో ఏర్పడే వైవాహిక జీవితంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. నమ్మకం అనేది ఒక బంధానికి పునాది. ఆ పునాది బలహీనపడితే, ఆ తర్వాత ఏర్పడే ఏ బంధమైనా నిలకడగా ఉండటం కష్టం. మోసానికి గురికావాలా వద్దా అనేది వ్యక్తిగత నిర్ణయమైనప్పటికీ, ఆ నిర్ణయం తాలూకు పర్యవసానాలు సమాజంపై, కుటుంబంపై కూడా పడతాయి. నేటి యువత స్వేచ్ఛను కోరుకోవడం తప్పు కాదు, కానీ ఆ స్వేచ్ఛ బాధ్యతతో కూడుకున్నదై ఉండాలి. ఆధునికత అంటే సంప్రదాయాలను కాలరాయడం కాదు, సంప్రదాయాలలోని సారాన్ని గ్రహించి వర్తమానానికి అన్వయించుకోవడం. వివాహ వ్యవస్థ అనేది కేవలం ఇద్దరు వ్యక్తుల కలయికే కాదు, రెండు కుటుంబాల అనుబంధం, సామాజిక స్థిరత్వానికి ఒక భరోసా. దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి యువతపై ఎంతైనా ఉంది. వివాహ పూర్వ సంబంధాల వల్ల కలిగే తాత్కాలిక ఆనందం కంటే, జీవితాంతం తోడుండే నమ్మకమైన బంధం ఎంతో విలువైనదని గుర్తించాలి. తొందరపాటు నిర్ణయాలు జీవితాన్ని అస్తవ్యస్తం చేస్తాయి. కాబట్టి, భావోద్వేగాలకు లోనయ్యే సమయంలో విజ్ఞతతో వ్యవహరించడం శ్రేయస్కరం. అప్పుడే వివాహం అనేది నిజంగానే ఒక మరపురాని మహోదయంగా మిగిలిపోతుంది.



# వరప్రసాద్ హాఫ్ సెంచరీ


ఈ రోజుల్లో ఓ సినిమా 50రోజుల పాటు థియేటర్‌లో ప్రదర్శింపబడటం చాలా అరుదైన విషయం. తాజాగా ఈ ఫీట్‌ని సాధించింది మెగాస్టార్ చిరంజీవి నటించిన 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం 109 కేంద్రాల్లో విజయవంతంగా అర్ధ శతదినోత్సవాన్ని పూర్తి చేసుకుంది. ఈ విషయాన్ని చిత్రబృందం సోమవారం వెల్లడించింది. ప్రస్తుతం 'మన శంకరవరప్రసాద్ గారు' ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 400 కోట్లకుపైగా వసూళ్లను సాధించి రికార్డు సృష్టించింది. ఓవర్‌సీస్‌లో కూడా వసూళ్ల పరంగా సత్తా చాటింది. చిరంజీవి వింటేజ్ కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్, ప్రత్యేక పాత్రలో అగ్ర నటుడు వెంకటేష్ చేసిన సందడి ఈ సినిమా అద్భుత విజయంలో కీలకభూమిక పోషించాయి. షైన్‌స్క్రీన్, గోల్డ్‌బాక్స్

# వంటల్లో స్పెషలిస్ట్‌ని!



షూటింగ్ ఉంటే లొకేషన్లోడ లేకపోతే ఇంట్లో.. అంతేతప్ప లేడీ సూపర్‌స్టార్ నయనతారకు వేరే వెకేషన్సేమీ ఉండవట. తన ఖాళీ సమయాన్నంతా పిల్లలతో ఆడుకోవడం, భర్తకు ఇష్టమైన వంటలు చేసిపెట్టడంతోనే సరిపోతుందట. పైగా వంట చేయడంలో నయన్ సిద్ధహస్తురాలట. ఈ విషయం గురించి ఇటీవల ఓ తమిళ ఇంటర్వ్యూలో నయనతార మాట్లాడుతూ 'చిన్నప్పుడు అమ్మ దగ్గర నేర్చుకున్న ఫలితం ఇదంతా. నేను ఏం ఐటమ్ చేసినా రుచిగా ఉంటుందని చాలామంది అంటుంటారు. నా భర్త విగ్నేష్‌కి టమాటా పప్పు చాలా ఇష్టం. నేను ఇంట్లో ఉంటే, ఆ రోజు వంటకాల్లో టమాటా పప్పు కచ్చితంగా చేస్తా. ఒక్కోసారి షూటింగ్స్ లేక గ్యాప్ ఎక్కువ వస్తుంది. దాంతో.. విఘ్నేష్‌కి రోజూ టమాటా పప్పే. 'ప్లీజ్ వద్దు.. వేరేదేదైనా చేయ్..' అని బతిమాలుతాడు. తనకోసం వేరే ఐటమ్ చేసినా, వాటితోపాటు టమాటా పప్పు కామన్' అంటూ అందంగా నవ్వేసింది నయనతార.

# విశ్వనాథ్ అండ్ సన్స్



అగ్ర కథానాయకుడు సూర్య కుటుంబ కథా చిత్రంలో నటించి చాలా రోజులైంది. గత కొన్నేళ్లుగా ఆయన మాస్ అండ్ కాన్సెప్ట్ ఓరియెంటెడ్ చిత్రాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఆయన పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకురాబోతున్నారు. సూర్య నటిస్తున్న ఈ తొలి తెలుగు స్ట్రెయిట్ చిత్రానికి 'విశ్వనాథ్ అండ్ సన్స్' అనే పేరును ఖరారు చేశారు. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకొని జూలైలో విడుదలకు సిద్ధమవుతున్నది. సోమవారం టైటిల్‌ను ప్రకటిస్తూ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. సూర్య ఓ చిన్నారితో కలిసి ఉన్న ఈ పోస్టర్‌ని చూస్తుంటే ఓ స్వచ్ఛమైన కుటుంబ చిత్రంగా తెరకెక్కించారని అర్థమవుతున్నది. విశ్వసనీయ సమాచారం ప్రకారం కుటుంబ కథతో పాటు సమాంతరంగా నడిచే ఓ లవ్‌స్టోరీ ఈ కథలో కీలకంగా ఉంటుందని చెబుతున్నారు. 45 ఏళ్ల కథానాయకుడిపై ఇష్టం పెంచుకునే ఇరవై ఏళ్ల అమ్మాయి, వారి బంధం తాలూకు భావోద్వేగాలు కథకు ఆయువుపట్టులా ఉంటాయని సమాచారం. మమితా బైజు, రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, బ్యానర్స్: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య, రచన-దర్శకత్వం: వెంకీ అట్లూరి.

# ఉస్తాద్ ఓటీటీ రైట్స్ నెట్‌ఫ్లిక్స్ సొంతం



పవర్ స్టార్ పవన్‌కల్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' మార్చి 26న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. 'గబ్బర్‌సింగ్''లాంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత పవన్, హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రం కావడంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదటి పాట రిలీజ్‌లో అంచనాలు రెట్టింపు అయ్యాయి. రెండో పాటకూ మంచి రెస్పాన్స్ వచ్చింది. మార్చి రెండో వారంలో ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. మరో రెండు పాటలు విడుదల కావాల్సి ఉంది. ప్రస్తుతం మేకర్స్ బిజినెస్ క్లోజ్ చేసే పనిలో పడ్డారు. ఈ సినిమా ఓటీటీ రైట్స్‌ను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. దాదాపు రూ.80 కోట్లకు డీల్ పూర్తయిందని టాక్. పవన్ కల్యాణ్ గత చిత్రం 'ఓజీ'కూ ఇంచుమించుగా ఇంతే అమౌంట్ ఫైనల్ చేశారు. ఓజీ సినిమా థియేట్రికల్‌గానే కాకుండా ఓటీటీలోనూ మంచి ఆదరణ దక్కించుకుంది. మైత్రీ మూవీస్ మేకర్స్ సంస్థ నిర్మిస్తోన్న చిత్రమిది. సినిమా మీదున్న నమ్మకంతో మైత్రీ సంస్థ ఓన్ రిలీజ్ చేస్తుందని సమాచారం . కర్ణాటకలో హోంబలే సంస్థ విడుదల చేయనుంది.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254, MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI, TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY, RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154